



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రామకృష్ణ

తేలని 'పైపుల' కథ

- విచారణలో జాప్యం - అవినీతిపై వ్యక్తమవుతున్న ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు నగరంలో తుంగభద్ర పుష్కరాల సమయంలో వ్యర్థపు నీటి కోసం వినియోగించిన పైపులకు సంబంధించి అవినీతి జరిగిందన్న ఆరోపణలపై విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 90 రోజులు దాటినా విచారణ కమిటీ నివేదిక ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

తుంగభద్ర పుష్కరాలు 2020 నవంబరు 20 నుంచి డిసెంబరు 7 వరకు జరిగాయి. కర్నూలు నగరం పరిధిలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన ఘాట్ల దగ్గర భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు, మురుగునీటి పైపులు, మౌలిక వసతులు, సుందరీకరణ, రోడ్లు వంటి పనులకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. నగరంలోని వ్యర్థపు నీరు పుష్కర ఘాట్ల వద్ద కలవకుండా పుష్కర ఘాట్ల వద్ద హెచ్‌డీ పైపుల ఏర్పాటు కోసం సుమారుగా రూ.6 కోట్ల ఖర్చు చేశారు. అందులో రూ.4.20 - 4.50 కోట్ల విలువైన హెచ్‌డి పైపులు కొనుగోలు చేసినట్లు ఇంజనీర్లు చెబుతున్నారు. పుష్కరాలు ముగిసిన తరువాత ఆ పైపులను వీకర్స్ సెక్షన్ కాలనీలోని సుందరయ్య పార్కులో భద్ర పరిస్తే అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. రూ.28 లక్షల విలువైన పైపులే కాలిపోయాని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన రూ.4 కోట్ల విలువైన పైపులు ఏమయ్యాయనేది తెలీదు. జూన్ 16న జరిగిన నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో 12వ వార్డు వైసిపి కార్పొరేటర్ కాంత్రికుమార్ పైపుల మాయం ఘటనపై నిలదీశారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్ ఎ.భార్గవ్‌తేజ ఆగస్టు 30న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ కన్వీనర్‌గా ఏడుగురు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. ఆ కమిటీలో ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ శేషసాయి సిటీ ప్లానర్ పి.ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ యు.మోహనకుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్న రాముడు, రెవెన్యూ అధికారి కెఎండి జునేద్‌లు సభ్యులుగా ఉన్నారు. ఆరు నెలల్లో సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశాలు జారీ చేశారు. నాలుగు నెలలు కావస్తున్నా ఈ కమిటీ ఒక్క రోజు కూడా సమావేశం కాలేదు. దీనిపై శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోనూ వైసిపి కార్పొరేటర్ క్రాంతికుమార్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. కమిటీ వేసినా విచారణ చేయడం లేదని ధ్వజమెత్తారు. విచారణ జరుగుతోందని, త్వరలో పూర్తవుతుందని మేయర్ బివై.రామయ్య సమాధానం ఇచ్చారు. పుష్కరాలకు కొన్ని పైపులే కొని ఎక్కువగా కొన్నట్లు చూపించారా? లేక కొన్న పైపులు మాయం చేశారా? అనేది తేలడం లేదు. గతంలో కౌన్సిల్ సమావేశంలో ఈ అంశంపై ఇంజనీరింగ్ అధికారులు సమాధానం ఇచ్చిన సందర్భంలో ఆ పైపుల గురించి స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయలేదని తెలిపారు. స్టాక్ రిజిస్టర్‌లో ఎందుకు నమోదు చేయలేదు అనేది పెద్ద సందేహంగా మారింది. అగ్ని ప్రమాదంలో రూ.4 కోట్ల విలువైన పైపులు కాలిపోతే ఎఫ్ఐఆర్‌లో రూ.28 లక్షలే అని ఎందుకు చూపారనే అంశాలపై విచారణ చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖచ్చితంగా అవినీతి జరిగిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు కోరుతున్నారు.


అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయిన పైపులు (ఫైల్)

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ
- కలెక్టరేట్ ఎదుట పత్తి రైతులతో ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నకిలీ పత్తి విత్తనాలు సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. నకిలీ విత్తనాలు సాగు చేసి నష్టపోయిన రైతులతో కలిసి శుక్రవారం ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. రైతుసంఘం జిలా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. కర్నూలు జిల్లాలో దాదాపు 2.55 లక్షల హెక్టార్లలో పత్తిని సాగు చేశారని తెలిపారు. ఇందులో 90 శాతానికి పైగా పంట దిగుబడి రాలేదన్నారు. జిల్లాలో అత్యధికంగా నకిలీ పత్తి విత్తనాలు సరఫరా అయ్యాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కనీసం వాటిని పరిశీలించలేదని మండిపడ్డారు. రైతులు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి సాగు చేసి నష్టపోయారని తెలిపారు. ఇప్పుడు వాతావరణ పరిస్థితులతో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు నివేదించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసిన పత్తి కంపెనీలపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలన అధికారి వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం నాయకులు జి.ఆంజనేయులు, మధుసూదన్, మహేష్, కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లోని రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైసిపి కార్పొరేటర్ల ఆగ్రహం

- రసాబాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- అమృత్ పథకంపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

వార్డులలో అభివృద్ధి పనులపై పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారని వైసిపి కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ హాల్‌లో మేయర్ బివై.రామయ్య అధ్యక్షతన నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 28 సాధారణ, 4 సప్లిమెంటరీ తీర్మానాలను మేయర్ రామయ్య చర్చకు తీసుకురాగా అందులో సప్లమెంటరీ ఎజెండాలోని 29వ అంశాన్ని ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పునరాలోచించాలని కోరగా ఆ ఒక్క అంశాన్ని మినహాయించి అన్నింటికీ ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు అన్ని రకాల పన్నులను ప్రజలు చెల్లిస్తున్నా అభివృద్ధి పనులకు నిధులు ఎందుకు కేటాయించడం లేదని మేయర్‌ను టిడిపి కార్పొరేటర్లు నిలదీశారు. వార్డులపై పక్షపాతం చూపించాల్సిన అవసరం పాలకవర్గానికి లేదని, ప్రతిపాదనలు అందజేస్తే నిధులు కేటాయిస్తామని మేయర్ సూచించారు. అజెండాలోని వాటికి మాత్రమే చర్చించి ఆమోదం తెలుపుతున్నారని, వార్డులోని సమస్యలను లేవనెత్తితే అంశం అజెండాలో లేదని దాటవేస్తు న్నారని పలువురు కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంజినీర్లపై ఎమ్మెల్యే కాటసాని ఆగ్రహం : 25, 26వ వార్డుల పరిధిలో డ్రైనేజీ లెవెల్ సరిగా లేక మురుగునీరు కాలనీల్లోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యపై చర్యలు తీసుకోవాలని రెండు, మూడు మార్లు చెప్పినా పట్టించుకోని ఇంజనీర్లపై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీర్లు ఏం చేస్తున్నారని, ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఎమ్మెల్యే నిలదీశారు.

బాధితులకు న్యాయం చేయాలి : కొండారెడ్డి బురుజు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్న తరుణంలో ఓపెన్ థియేటర్ కాంప్లెక్స్‌లో షాపులు కోల్పోయిన భాదితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ సూచించారు. కొన్నేళ్లుగా వ్యాపారం చేసుకుంటూ ఒక దివ్యాంగుడు కుటుంబాన్ని పోషిస్తున్నారని, ఇలా షాపు కోల్పోయి వీధిన పడ్డ వారందరికీ ప్రత్యామ్నాయ షాపులు కేటాయించాలన్నారు.

శ్మశాన వాటికలో వసూళ్లను అరికట్టాలి

శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు డిమాండ్ చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకొని నగరపాలక సంస్థ తరపున ఒక రేటు నిర్ణయించాలని పలువురు కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. శ్మశాన వాటికలు కొన్ని ఆక్రమణలకు గురవుతున్నాయని, మరికొన్ని అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయని, కాంపౌండ్ వాల్ నిర్మించి శ్మశాన వాటికలను పరిరక్షించాలని కార్పొరేటర్లు సూచించారు.

అమృత్ పథకంపై దుమారం

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీటిని అందించాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద కుళాయి కనెక్షన్ ఉచితమని ఆనాడు చెప్పి ఇప్పుడు రూ.10,500 కుళాయి కనెక్షన్‌కు డిపాజిట్ కట్టాలని, లేకపోతే కనెక్షన్ తొలగిస్తామంటూ అధికారులు బెదిరిస్తున్నారని టిడిపి కార్పొరేటర్ పరమేష్ లేవనెత్తారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... టిడిపి ప్రభుత్వం హడావుడి చేసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఉచిత కనెక్షన్లు అంటూ మోసం చేసిందన్నారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు కోసం కౌన్సిల్ తీర్మానం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంపాల్ రెడ్డి సూచించారు. అనంతరం కార్పొరేటర్లు తమ వార్డు పరిధిలోని సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. మేయర్ అందుకు సమాధానం చెబుతూ ప్రాధాన్యత క్రమంగా పనులను ప్రారంభించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ ఎ.భార్గవ తేజ, అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమాదేవి, ఆర్అండ్‌బి ఎస్ఇ శ్రీధర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఇ శేష సాయి, ఎంహెచ్‌ఓ డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ రామయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని



సదస్సులో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

సిపిఎస్ రద్దు కోసం చలో ఢిల్లీ

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సిపిఎస్ రద్దు కోసం ఈనెలాఖరులో ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలో 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కర్నూలు నగరంలోని దామోదరం సంజీవయ్య మున్సిపల్ స్మారక ఉన్నత పాఠశాలలో సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సదస్సు నిర్వహించారు. నగర కార్యదర్శి భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిపిఎస్ రద్దు పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని మండిపడ్డారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి టెక్నికల్ సమస్య తెలియకుండానే హామీఇచ్చారని తెలిపారు. దీనికి బదులుగా జిపిఎస్‌ను అమలు చేస్తామని ప్రకటించారని అన్నారు. జిపిఎస్ విధానాన్ని అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వ కుట్ర దాగి ఉందని తెలిపారు. ఈ రెండు విధానాలు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రమాదకరమేనని చెప్పారు. రెండు విధానాలనూ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు కోసం సాగే ఉద్యమంలో ఒపిఎస్ ఉద్యోగులు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.జయరాజు, జిల్లా సహాధ్యక్షులు యుఆర్ఎ.రవికుమార్, జిల్లా కార్యదర్శి ఇబ్రహీం పాల్గొన్నారు.

సోయాబీన్స్ విక్రయాలను ప్రారంభించిన కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఈ నామ్ పద్దతిలో సోయాబీన్స్ క్రయవిక్రయాలను శుక్రవారం మార్కెట్ గౌరవాధ్యక్షులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నామ్ లో కొనుగోళ్లు చేసుకోవడం వల్ల మంచి పోటీధర వస్తుందని, రైతులందరు మార్కెట్‌లో పంట ఉత్పత్తులు క్రయ విక్రయాలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ భీమేశ్వరెడ్డి, కార్యదర్శి గోవిందు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.


మురుగు కాలువను పరిశీలిస్తున్న పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు

అవసరం లేని చోట పనులెందుకు ?: పిపిఎస్ఎస్

ప్రజారోగ్యశాఖ , ఇంజనీర్ల నిర్వాకం
వార్డు కార్పొరేటర్ జైల్లో ఉండడంతో తల్లి లేని బిడ్డల స్థానిక ప్రజల పరిస్థితి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ ఇంజనీర్లు ఈ మధ్యకాలంలో నేల విడిచి సాము చేస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారు. రూ.లక్షల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారు. అవసరం ఉన్న వాటిని వదిలేసి అవసరంలేని ప్రాంతాల్లో అభివద్ధి పనులు చేస్తున్నారు. శుక్రవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం(పిపిఎస్ఎస్) ప్రతినిధి బృందం సుందరయ్య జంక్షన్ నుండి కెకె. భవన్ మీదుగా కల్లూరు రోడ్‌లో పర్యటించింది. పిపిఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు పి.ఇక్బాల్ మాట్లాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి పలు అంతస్తుల భవనాలు నిర్మించుకొని రూ.లక్షలు నగరపాలక సంస్థకు పన్నుల రూపంలో చెల్లిస్తున్నారన్నారు. కనీసం మురుగు కాలువలు నిర్వహించాలనే స్పృహ కూడా ఇంజనీరింగ్ అధికారులకు లేదన్నారు. ఈ ప్రాంతంలో నర్సింగ్ హోమ్ లు, లాడ్జిలు, అనాధ బాలల ఆశ్రమం కోసం రోజూ వంద లాదిమంది వస్తుటారు. గతంలో పారిశుధ్య అధికారుల దృష్టికి తెచ్చినా కనీసం నెలకు ఒకసారి కూడా ఉన్న కాలువలు రోడ్డు శుభ్రం చేయడం లేదన్నారు. ఈ వార్డు కార్పొరేటర్ జైల్లో ఉండడంతో తల్లి లేని బిడ్డలా ఈ వార్డు ప్రజల పరిస్థితి మారిందన్నారు. కమిషనర్ పర్యటించి కొత్త మురుగు కాలువలు నిర్మించి ఉన్న వాటిని క్రమం తప్పకుండా శుభ్రం చేసేటట్లు ఆదేశాలివ్వాని కోరారు. ఈ పర్యటనలో ఎం.నాగరాజు, ఎన్.మద్దిలేటి, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే : ఎస్‌పి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ అన్నారు. కర్నూలు జిల్లా ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బందికి గ్రీవెన్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు , ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది మొత్తం 26 మంది మెడికల్ సమస్యలు, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్‌పికి స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్‌పి సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. సిబ్బందినుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ ఎఒ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్ పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు 10,11తేదీల్లో వేలం

క్రైమ్, ఎక్సైజ్ కేసుల్లో చిక్కుకున్న వాహనాలు , అక్రమంగా మద్యం, సారా, గంజాయి తరలిస్తూ పట్టుబడిన వాహనాలను కర్నూలు సెబ్ , కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు జప్తు చేసిన మొత్తం 280 వాహనాలను డిసెంబర్ 10, 11 వ తేదీలలో వాహనాలకు వేలం నిర్వహించ నున్నామని కర్నూలు జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ శుక్రవారం తెలిపారు. ఈ వాహనాల వేలం 2 ప్రాంతాలలో ఉంటుందన్నారు. కర్నూలు జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం (డిటిసి) దిన్నెదేవరపాడు గ్రామం, జగన్నాథగట్టు దగ్గర ఈనెల పదవ తేదీన, కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్ (బి.తాండ్రపాడు) వద్ద 11న వేలం నిర్వహించనున్నామని చెప్పారు. ఉదయం 10 గంటలకు ఆయా పోలీస్ అధికారుల సమక్షంలో వాహనాల వేలం ప్రారంభమవుతుందన్నారు. పాల్గొనదలచిన వారు తగు ధరావత్తు చెల్లించి వాహనాల వేలంలో పాల్గొనాలన్నారు. వేలానికి ఉంచే వాహనాల్లో ద్విచక్ర, త్రీ వీలర్ ఉన్నాయన్నారు. డిసెంబర్ 10 వ తేది కర్నూలు , దిన్నెదేవరపాడు గ్రామం, జగన్నాథగట్టు దగ్గర ఉన్న కర్నూలు జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ద్విచక్రవాహనాలను, త్రీ వీలర్ వాహనాలను వేలంలో ఉంచనున్నారు. ఈనెల11న కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్ లో ఫోర్ వీలర్ వాహనాలను వేలంలో ఉంచనున్నామన్నారు.


వద్యార్థులకు పాఠాలు చెబుతున్న వంటమనిషి

వంటమనిషితో విద్యాబోధన!

-ఏడు తరగతులకు ఒక్కరే దిక్కు- నాడునేడులో హెచ్ఎం
-గదుల,టీచర్ల కొరతతో నాణ్యమైన విద్య కరవు

ప్రజాశక్తి- సి బెళగల్ : సిబెళగల్ మండలం గొల్లలదొడ్డిలోనీ ప్రాథమికోన్నత పాఠశాలలో వంటమనిషితో విద్యాబోధన సాగుతోంది. ఆ పాఠశాలలో ప్రధానంగా ఏడు తరగతులకు 128 విద్యార్థులకు గాను టీచర్ల కొరత తీవ్రంగా వేదిస్తోంది. హెచ్ఎం. నాగరాజు నాడు నేడు పనులలో బిజీగా అయ్యారు. ఇక ఉన్నది ఎస్‌జిటి టీచర్ నరసింహులు మాత్రమే దిక్కయ్యారు. తరగతి గదులు కూడా రెండు మాత్రమే ఉండటంతో అటు టీచర్ల కొరత, ఇటు గదుల కొరత కారణంగా గత్యంతరం లేక ఒకే గదిలో ఏడు తరగతులను ఒకే చోట కూర్చోబెట్టి ఒక వైపు టీచర్, మరో వైపు వంటమనిషి విద్యానందించాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడే నాణ్యమైన విద్య అందక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత మూడేళ్లనుంచి ఎఫ్ఎల్ఎఫ్ టీచర్ రాజారావు పనిచేస్తుండగా జిల్లా విద్యాధికారి డిప్యుటేషన్ పై కర్నూలుకు మార్చడం అంతర్యమేమిటో గాని ఈ పాఠశాలను స్థాయి పెంచారు గాని, తగు ఉపాధ్యాయులను నియమించడం మరిచారు. ఇందుకు మండల విద్యాధికారిణి జ్యోతి కూడా తగు దృష్టి సారించకపోవడం శోచనీయం.

వైసిపిలో ముస్లింలకు పెద్దపీట

-ముస్లింల ద్రోహి చంద్రబాబు
-ఎన్నికల కోసమే ముస్లిం అంశం ముందుకు
-మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదు
-ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : వైసిపి ప్రభుత్వ పాలన లోనే ముస్లింలకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హఫీస్ ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు రాయల్ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు కేవలం రాజకీయ స్వార్థంతోనే ముస్లింల అంశాన్ని ముందుకు తెస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే నంద్యాల టిడిపి సీనియర్ ముస్లిం నాయకులు మాజీ మంత్రి ఎండి. ఫరూక్ కు కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వకుండా ఇబ్బందికి గురి చేశారని గుర్తు చేశారు. నాటి ఎమ్మెల్సీ షరీఫ్‌కు ఎందుకు మంత్రి పదవిని ఇవ్వలేదని ప్రశ్నించారు. ముస్లింలను సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా పూర్తిగా అన్యాయం చేశారన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోసం రాజకీయం చేస్తున్నారన్నారు. మళ్లీ మోసపోవడానికి ముస్లింలు సిద్ధంగా లేరన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉర్దూను ద్వితీయ భాషగా వైసిపి ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టామని చెప్పారు. టిడిపి హయంలో పెన్షన్ కోసం రూ.500 కోట్లు ఖర్చు చేస్తే వైసిపి ప్రభుత్వంలో రూ.1500 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షిస్తానని చంద్రబాబు చెబుతున్నాడని, అంతకంటే ముందే 5.50వేల ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వక్ఫ్ బోర్డులను రీ సర్వే నిర్వహించి డిజిటలైజేషన్ రికార్డులు రూపొందిస్తున్నా మన్నారు. ఇప్పటికే 50 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. ఇది గతంలో మీరు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు ఎన్‌టిఆర్ బీమాను ప్రవేశపెడతామని అంటున్నారని, ఇదివరకే వైఎస్ఆర్ బీమా ప్రవేశపెట్టి 7 కోట్ల మందికి భరోసా ఇచ్చారన్నారు. రాజకీయ రిజర్వేషన్లలో నామినేటెడ్ పోస్టులలో ఎస్సీ ఎస్టీ బీసీలకు 50 శాతం పదవులు కల్పించారన్నారు. ముస్లింల అభివృద్ధి గురించి చంద్రబాబు మాట్లా డడం హాస్యాస్పదమన్నారు. ఆయన చెబుతుంటే తాము వినాల్సి రావడం మాకి ఇదేం కర్మ అని ఎద్దేవా చేశారు. ఎన్ఆర్‌సి, సిఐఏల విషయంలో వాటికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి ఘనత వైసిపిదని టిడిపి ఎందుకు ఆ పని చేయలేకపోయిందని ప్రశ్నించారు. భూతద్దంలో పెట్టి తప్పులు వెతకడం మానుకోవాలి అన్నారు. చంద్రబాబు మంచి ఆలోచనతో, విలువలతో రాజకీయాలు చేయాలని ఆయన కోరారు.



రక్తదానం ప్రాణదానంతో సమానం

టిడిపి కర్నూల్ ఇన్చార్జి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు కాపాడటం గొప్ప విషయమని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని మౌర్య ఇన్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరకడం చాలా కష్టంగా మారిందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానం చేస్తూ ఉండాలన్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి రక్తదానం చేయడం ఎంతో మంచి కార్యక్రమం అన్నారు. రక్తదానం చేసిన బ్యాంకు సిబ్బందికి పండ్లు, పండ్లరసాలు అందజేశారు. నిర్వాహకులు టిజి భరత్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు ఉమేష్ కుమార్, శిరీష్ కల్యాణ్, గౌస్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న టిజి .భరత్

గ్రామాలాభివృద్ధిలో భాగస్వామ్యులవుదాం

- ఎంపిపి లక్ష్మిదేవమ్మ

ప్రజాశక్తి - నందవరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ, ఇఒఆర్‌డి

గ్రామాలాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపిపి లక్ష్మిదేవమ్మ కోరారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2023-24పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఏ విధంగా అభివృద్ధి చేయాలనే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీటి సమస్య లేకుండా చూడడం, ప్రజలకు సరైన సమయంలో సరైన సేవలు అందించడం వంటి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధిలో అధికారుల బాధ్యత ఎంత ఉంటుందో, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లకు కూడా అంతే బాధ్యత ఉంటుందని తెలిపారు. గ్రామాలాభివృద్ధి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ ఎఇలు జయన్న, వెంకటరాముడు, రవీంద్ర, ఎపిఎం వీరన్న, సూపర్‌వైజర్ సుచరిత, పంచాయతీ కార్యదర్శులు రంగనాయకులు, నౌసన్న, ఆనంద్, వైస్ ఎంపిపి నడిపి షేక్ సాహెబ్, ఎపిఒ మాలిక్, సర్పంచులు విరుపాక్షి రెడ్డి, శివన్న, పావని, కిష్టప్ప పాల్గొన్నారు.

జగన్ ముఖ్యమంత్రి కావడమే రాష్ట్రానికి ఖర్మ

- టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం



ప్రజలతో మాట్లాడుతున్న ఉలిగయ్య

రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడమే పెద్ద ఖర్మ అని టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉలిగయ్య ఎద్దేవా చేశారు. శుక్రవారం మండలంలోని చూడి గ్రామంలో 'ఇదేమి ఖర్మ... మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి ఎలా ఉందో, ప్రస్తుత ప్రభుత్వంలో ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమం సంక్షోభంలో పడిందని తెలిపారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉందంటే ఇక ప్రజల సంక్షేమం పక్కదారి పడుతోందని మండిపడ్డారు. అభివృద్ధి అనేది కనుచూపు మేరలో కూడా కనిపించని పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి పాలన పట్ల ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర యువత సురేష్ నాయుడు, నాగేశ్వరరావు, సిద్ధప్ప, దర్గా మౌల సాబ్, రామలింగ, సురేష్, కృష్ణ, లింగేష్, రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి చెప్పాలి

- త్రీ టౌన్ సిఐ శ్రీరామ్

ప్రజాశక్తి - ఆదోని



కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ శ్రీరామ్

అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి చెప్పాలని, లేకపోతే పోలీసు పవర్ రుచి చూపిస్తామని ఆదోని త్రీ టౌన్ సిఐ శ్రీరామ్ హెచ్చరించారు. శుక్రవారం స్టేషన్ ఆవరణలో పాత కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని స్టేషన్ పరిధిలో మట్కా, పేకాట, దోపిడీ, దౌర్జన్యాలు, సారా, అక్రమ మద్యం అమ్మడం, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు స్వస్తి పలకాలని సూచించారు. పద్ధతి మార్చుకోకపోతే తన రూటే సపరేటు అని, దానికి మీరే బాధ్యులు అవుతారని హెచ్చరించారు. ఒకసారి కేసు నమోదయిన వారు మరోసారి రిపీట్ అయితే పరిస్థితులు వేరుగా ఉంటాయని తెలిపారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు పలు కేసుల్లో అనుమానితులకు సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయన్నారు. తప్పులు చేస్తే ఎవరో రక్షిస్తారని భ్రమ పడితే సహించే ప్రసక్తే లేదన్నారు. అమాయకులను ఇబ్బందులకు గురి చేయడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి వాటిని కూడా సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పేరు పేరు పిలిచి 'వార్నింగ్' ఇవ్వడంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గుండెల్లో రైళ్లు పెరిగెత్తేలా అయింది. ఎస్ఐ ముని ప్రతాప్, పోలీసులు ఉన్నారు.

రీసర్వేపై ఎలాంటి అపోహలూ వద్దు

- జెసి రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై ప్రజలు ఎలాంటి అపోహలూ పెట్టుకోవద్దని జెసి రామ సుందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సాయిబాబా సినిమా హాలులో మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్లు (సర్వే), సర్వే అధికారులతో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ రమణ కాంత్ రెడ్డితో కలిసి వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడారు. ఆదోని డివిజన్‌లో 56 గ్రామాలు, పత్తికొండలో 10 గ్రామాలు మొత్తం 66 గ్రామాల్లో భూముల సర్వే పూర్తి చేశారని



వివరాలు వెల్లడిస్తున్న జెసి రామసుందర్ రెడ్డి

తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కుదారులకు జగనన్న భూహక్కు, భూరక్ష పత్రాలు రాగానే పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో భాగంగా తగిన నివేదికలు టీంల వారీగా రూపొందించి రోజువారీ కార్యక్రమాలు వివరించి, వాటిని జిల్లా అధికారులు రూపొందించిన గూగుల్ వర్క్ షీట్‌లో ఎప్పటికప్పుడు రెవెన్యూ వారి ద్వారా అందజేయాలని తెలిపారు.

జాతీయ రహదారి గుంతలమయం

- ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి - మంత్రాలయం

జాతీయ రహదారి 167 గుంతలమయమైంది. గుంతల పడిన రహదారిలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మిగనూరు నుంచి మంత్రాలయం మీదుగా ఉన్న జాతీయ రహదారిలో గుంతలు పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, బస్సుల్లో ప్రయాణించే వారు గుంతల వల్ల కుదుపులకు ఉలిక్కిపడుతున్నారు. కలుదేవకుంట, చిలుకలడోన మధ్యలో గుంతలు పడినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇక మాధవరం సమీపంలో వాగుపై ఉన్న గుంత వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను కూడా పోగొట్టుకున్న సంఘటనలూ ఉన్నాయి. ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో జాతీయ రహదారిపై వేసిన విద్యుద్దీపాలు వెలగకపోవడం వల్ల పాదచారులు ప్రాణాలు కోల్పోయారు. టోల్ ప్లాజా ద్వారా వాహనదారుల నుంచి నిర్ణయించిన ధరల ప్రకారం ముక్కు పిండి మరీ రుసుం వసూలు చేస్తున్నారు. నిర్వహణ బాధ్యతను విస్మరించారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించకపోవడంతో వాహనాల డ్రైవర్లు తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం గుంతలు పడిన జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు రక్షణ కల్పించాలని వాహన దారులు కోరుతున్నారు.



మంత్రాలయం సమీపంలో జాతీయ రహదారిపై పడిన గుంతలు



ఎంపికైన విద్యార్థితో స్కూల్ యాజమాన్యం

రాష్ట్రస్థాయి పోటీలకు ఆర్‌విఆర్ విద్యార్థి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ ఆర్‌విఆర్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న మురారి అనే విద్యార్థి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ జాయ్ భాస్కరన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అవుట్‌డోర్ స్టేడియంలో ఈనెల 6న అండర్-14, అండర్ 17 హాకీ ఎంపికలు పోటీలు జరిగాయని తెలిపారు. ఈ పోటీల్లో తెర్నేకల్ ఆర్‌విఆర్ స్కూల్ విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయినట్లు చెప్పారు. ఎంపికయిన విద్యార్థిని సర్పంచి మొగతాళ్ అరుణ్ కుమార్ అభినందించారు. విద్యార్థులందరూ క్రీడలలో రాణించాలని, పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు ఖాజా హుస్సేన్, జి.ప్రీతి మాట్లాడుతూ... ఎంపికైన విద్యార్థి బి.మురారి, ఈనెల చివరి వారం అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పాల్గొంటారని తెలిపారు.

ఉపాధి పనులకు ఎక్కువగా వెళ్లేలా చూడాలి : ఎపిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 16 గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులకు జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ వెళ్లేలా చూసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందికి ఎపిఒ మాధవ శంకర్ సూచించారు. శుక్రవారం నేమకల్లు గ్రామంలోని వంకల్లో ముమ్మురంగా సాగుతున్న పూడికతీత పనులను పరిశీలంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోనూ ఉపాధి హామీ పనులకు వెళ్లే శాతం ఎక్కువగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో పనులు లేవని వలస వెళ్తున్నారనే మాట రాకూడదని చెప్పారు. ఎక్కువ వ్యవధి లేకుండా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల డబ్బులను త్వరగా మంజూరు చేస్తోందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.



నేమకల్లులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న



మాట్లాడుతున్న భీమప్ప చౌదరి

పంట నమోదు తప్పనిసరి

- వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ భీమప్ప చౌదరి

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ భీమప్ప చౌదరి తెలిపారు. శుక్రవారం హాలహర్వి ఆర్‌బికెలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ భీమప్ప చౌదరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భీమప్ప చౌదరి, జడ్‌పిటిసి లింగప్ప మాట్లాడారు. పంట నమోదు చేయించుకుంటే ప్రభుత్వం నుంచి అన్ని రకాల రాయితీలు వర్తిస్తాయని తెలిపారు.

డివిఎంసి సభ్యులుగా శాంతి కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ



జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా దేవనకొండ గ్రామానికి చెందిన కాకర్ల శాంతి కుమార్ ఎంపికయ్యారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్ ఆవరణలో జరిగిన డివిఎంసి సభ్యుల ఎంపికలో నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ నుంచి తనను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ఎంపికకు సహకరించిన రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం, కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్‌కు, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్రమ మద్యం విక్రయాన్ని ఆపాలి : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో కర్ణాటక అక్రమ మద్యం విక్రయాన్ని ఆపాలని ఎఐవైఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో సిఐ హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల ఆవరణలోనే మద్యం దందా జరగడంతో బాలికలకు ఇబ్బందిగా మారిందన్నారు. తాగుబోతుల వీరంగం వల్ల రాత్రివేళల్లో మహిళలు, పిల్లలు రోడ్డుకు రావడానికి భయపడుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు కె.రమేష్ కుమార్, కోశాధికారి లింగప్ప, ప్రజా నాట్య మండలి ఈరన్న, ప్రసాద్ పాల్గొన్నారు.



సిఐకి వినతిపత్రం అందజేస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన

రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలో నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి యు.ఈరన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌బికె వ్యవసాయ అధికారి కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతేడాది మార్కెట్‌లో పత్తికి మంచి ధర ఉండడం వల్ల ఈ ఏడాది ఎక్కువగా రైతులు పత్తి పంట సాగుకు మొగ్గు చూపారని తెలిపారు. దీనిని అదునుగా భావించిన పత్తి విత్తన కంపెనీలు జిల్లాలో 30 రకాల విత్తనాలను మార్కెట్‌లోకి తీసుకొచ్చాయని చెప్పారు. 5 రకాల పత్తి విత్తనాలు మంచి దిగుబడి వచ్చాయని, మిగిలిన అన్ని రకాల విత్తనాల నాసిరకంగా ఉన్నాయని తెలిపారు. ఈఏడాది పత్తి పంట బాగా వస్తుందని ఆశించిన రైతుకు నకిలీ విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టినా చేతికొచ్చే పరిస్థితి లేదన్నారు. పత్తి చెట్టు ఏపుగా పెరిగినా చెట్టుకు 3 నుంచి 5 కాయలు కూడా లేవని తెలిపారు. వెంటనే వ్యవసాయాధికారులు మండలంలో నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతు పొలాలను పరిశీలించి, నష్టపోయిన రైతులకు విత్తన కంపెనీల నుంచి ఎకరాకు రూ.40 వేల పరిహారం ఇప్పించాలని కోరారు. లేకపోతే రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతులు పరమేష్ గౌడ్, సిద్ధప్ప, ఏడుకొండలు, డీజిల్ లింగన్న, నారాయణ, రామలింగ, గఫూర్ పాల్గొన్నారు.



ఆలూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆస్పరి ఎఒ మునెమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి జి.రంగస్వామి మాట్లాడారు. ఆస్పరితోపాటు యటకల్లు, నగరూరు తదితర గ్రామాల్లో రైతులు నష్టపోయి అప్పుల పాలయ్యారని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోకపోతే రైతులను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజినేయులు, రైతుసంఘం సీనియర్ నాయకులు మాణిక్యప్ప, లింగన్న, నారాయణ, రామలింగడు, గఫూర్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి

ప్రజాశక్తి- కోసిగి రూరల్

మండలంలోని సాతనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎం.కృష్ణ రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. అండర్-17 కేటగిరిలో కడప జిల్లా ఎర్రగుంట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతి విద్యార్థీ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. మారుమూల గ్రామమైన సాతనూరు నుంచి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - చిప్పగిరి

గుంతకల్లు పట్టణంలోని నారాయణపేటలో ఉన్న కనకదుర్గమ్మ దేవాలయ అభివృద్ధి పనులకు వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ రూ.లక్ష విరాళాన్ని గుంతకల్లు ఎమ్మెల్యే వైవిఆర్ అల్లుడు, వైసిపి సీనియర్ నాయకులు మంజునాథరెడ్డి చేతులమీదుగా అందజేశారు. శుక్రవారం దేవాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలో పాల్గొని కొడుకు బాలాజీ చేత మాల ధరింపజేశారు. దేవాలయ కమిటీ సభ్యులంతా నారాయణను సన్మానించారు.

ప్రతి నెలా 1న జీతాలివ్వాలి : ఎస్‌టియు

ఫోటో : సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రప్ప

ప్రజాశక్తి - ఆస్పరి

ఉద్యోగ, ఉపాధ్యాయులు, పింఛనర్స్ జీతాలను ప్రతి నెలా 1న ఖాతాలో వేయాలని ఎస్‌టియు జిల్లా కార్యదర్శి పి.నాగేంద్రప్ప, మండల నాయకులు జ్యోతి మూర్తి, తిమ్మప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఆస్పరిలో విలేకరులతో మాట్లాడారు. 10వ తేదీ వచ్చినా జీతాలు రాకపోతే ఎలా అని వాపోయారు. ప్రతినెలా జీతాల కోసం ఎదురు చూడటం దురదృష్టకరమని తెలిపారు. ప్రభుత్వం స్పందించి నెల నెల 1న జీతాలు అందేలా చూడాలని కోరారు.

నరసన్న మృతికి పలువురి సంతాపం

- బంధువులు, ఆత్మీయుల మధ్య అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి పట్టణ నాయకులు కదిరికోట ఆదెన్న తండ్రి కదిరికోట నరసన్నకు పలువురు నివాళులర్పించారు. రాజకీయాల్లో కోట్ల విజయభాస్కర రెడ్డి అభిమానిగా, మాజీ ఎమ్మెల్యే కెఆర్ అనుచరునిగా ప్రధాన భూమిక పోషించిన నరసన్న గుండెపోటుతో మృతి చెందడంతో ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం పలువురు రాజకీయ నాయకులు నరసన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కదిరికోట ఆదెన్నను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని ఎస్సీ శ్మశాన వాటికలో బంధువులు, ఆత్మీయుల మధ్య అంత్యక్రియలు ముగిశాయి. కదిరికోట నరసన్న మృతి పట్ల కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఆర్.హనుమంతు రెడ్డి కుమారులు కెఆర్.రాఘవ రెడ్డి, కెఆర్.ఓంకార్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కె.పార్థసారథి రెడ్డి, ఆరవీటి సుధాకర్ శెట్టి, కాంగ్రెస్ (ఐ) ఇన్‌ఛార్జి, అడ్వకేట్ కె.లక్ష్మీనారాయణరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి కోట్ల సుజాతమ్మ, ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్ర గౌడ్, టిడిపి మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, బిజెపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెఆర్.మురహరి రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నరవ రమాకాంత్ రెడ్డి, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చందోలి తిరుపాలు, ఎమ్మిగనూరు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ వైపిఎం.కొండయ్య చౌదరి, డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, టిడిపి జిల్లా కార్యదర్శి బి.ప్రభాకర్ నాయుడు, నందవరం మాజీ జడ్‌పిటిసి ముగతి ఈరన్న గౌడ్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎం.ఖాసీం వలీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ బిఎన్.నాగరాజు, నాయకులు బూదూరు రాఘవేంద్ర రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు విజిఎ.దయాసాగర్, ఇ.రాందాస్ గౌడ్, రుద్రాక్షల బజారి, మాజీ కౌన్సిలర్లు మాచాని శివ కుమార్, జిఎమ్‌డి.ఇక్బాల్, హరి ప్రసాదరెడ్డి, చేనేత మల్లికార్జున, ఎం.సుందర రాజు, బి.జేమ్స్, మాల మధుబాబు, ఇప్పె నరసప్ప, వెంకటాపురం బచ్చాల రంగన్న, మాజీ సర్పంచులు గోనెగండ్ల బోయ రంగముని, ముగతి బాలరాజు, వైసిపి నాయకులు కె.దేవరాజు, గురవ మాబాష, మాజీ ఎంపిటిసి జగ్గాపురం చిన్న ఈరన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం, ఎపిడబ్ల్యుయుజె నాయకులు శ్రీనివాస నాయుడు, భీమన్న, రిటైర్డ్ డిప్యూటీ డిఇఒ పి.నాగభూషణం, యుఎస్ఎఫ్ఐ ఉదయ్, సిపిఎం నాయకులు నాయకల్లు అంబేద్కర్, ఉపాధ్యాయ సంఘాల నేతలు దావీదు, పి.మాదన్న, మారుతాత్మజ, ఆరెకంటి భాస్కర్, కె.సుప్రసాద్, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు హాలహర్వి దావీదు, న్యాయవాదులు ఎం.హిజకీయా, నబిరసూల్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ కొమ్మినేని భోజరాజు, రైతు కూలి సంఘం నాయకులు ఏసేపు, సానుభూతి తెలిపారు.



నివాళులర్పిస్తున్న పాలకుర్తి తిక్కారెడ్డి



బైక్ యాత్ర గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

వేదవతి నీటి సాధనకు బైక్ యాత్ర

- ఆర్‌సిసి ఆధ్వర్యంలో గోడపత్రికలు విడుదల

ప్రజాశక్తి - ఆస్పరి

మండలానికి వేదవతి నీటిని అందించాలని బైక్ యాత్ర నిర్వహిస్తున్నామని ఆర్‌సిసి జిల్లా నాయకులు మసాలా ప్రకాష్ తెలిపారు. శుక్రవారం గాంధీ విగ్రహం ఆవరణలో బైక్ యాత్ర గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేదవతి ప్రాజెక్టు సామర్థ్యాన్ని 8 టిఎంసిలకు పెంచి మండలానికి సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. నీటి సాధన కోసం ఈ నెల 13న ఆలూరు నుంచి ఆస్పరి మండలం మీదుగా ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఈ బైక్ యాత్రలో రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నియోజవర్గ నాయకులు రాజ్‌కుమార్, మండల నాయకులు వీరేష్, సందీప్, అక్బర్, రామకృష్ణ, మహేంద్ర, రాజు, మధు, శీను పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష వీడాలి

- మహిళలపై లైంగిక వేధింపులపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మహిళలపై వివక్ష వీడాలని ఎంపిపి గొల్ల కేశన్న తెలిపారు. శుక్రవారం ఎమ్మిగనూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం 'మహిళలపై వేధింపులను నిషేధం, నివారణ పరిహారం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి గొల్ల కేశన్న, ఎంపిడిఒ బంగారమ్మ, ఇఒఆర్‌డి విజయలక్ష్మి మాట్లాడారు. మహిళలకు రక్షణ కలిపించే విధంగా సహకరించాలని కోరారు. మహిళలపై వివక్షత లేకుండా, మహిళల పట్ల మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసిలకు గ్రామీణ అభివృద్ధి ప్రణాళిక 2023-24 సంవత్సరానికి, వాతావరణ మార్పులపై ఒకరోజు శిక్షణ సంబంధిత అధికారులు ఇచ్చారు.

ప్రభుత్వ భవన నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని దౌల్తాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సుధీర్ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయ, రైతు భరోసా, జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శ్రీరాములు మాట్లాడారు. ప్రభుత్వ భవన నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని, ఇంటి నిర్మాణాలు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఎపిఎం నాగార్జున, హౌసింగ్ అధికారి భవ్య పాల్గొన్నారు.



భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీరాములు

క్రీడల్లోనూ రాణించాలి

- ప్రధానోపాధ్యాయులు సునయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ప్రధానోపాధ్యాయులుతో ఉన్న విద్యార్థులు

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్-ఎస్.సునయం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. అండర్-17 ఫుట్ బాల్ పోటీలో పదో తరగతికి చెందిన బి.వీరేంద్ర, అండర్-14 విభాగంలో ఎన్.రాజులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కడప జిల్లా ఎర్రగుంట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఆటలో మెళకువలు నేర్పిన ఫిజికల్ డైరెక్టర్ రాజారామ్మోహన్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం బహిష్కరణ

ప్రజాశక్తి-ఆలూరు



ఆలూరు మండల పరిషత్ సమావేశ భవనంలో జరగాల్సిన సర్వసభ్య సమావేశాన్ని వైసిపి ప్రజాప్రతినిధులు బహిష్కరించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశానికి 12 గంటలైనా మండల అధికారులు హాజరు కాకపోవడంతో జడ్‌పిటిసి ఏరూరు శేఖర్ ఆధ్వర్యంలో ఎంపిటిసిలు, సర్పంచులు మండల సమావేశాన్ని బహిష్కరించి కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ప్రజా ప్రతినిధులు అంటే తక్కువగా చూస్తున్నారని, అధికారులు కనీస మర్యాదలు కూడా ఇవ్వడం లేదని, ఏదైనా సమస్య మీద వెళితే సామాన్యులకు ఇచ్చిన మర్యాద కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఏ పని అడిగినా అధికారులు జవాబు చెప్పడం లేదని, ప్రజా ప్రతినిధులను కరివేపాకులా తీసిపారేస్తున్నారని తెలిపారు. నిధులు లేకపోగా విధులయినా నిర్వహించుకుందామని అనుకుంటే అధికారులు సహకరించడం లేదన్నారు. మండల కార్యాలయాల్లో ఏ ఒక్క పని కూడా జరగడం లేదని, కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారి వరకు నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారని, గౌరవ వేతనాలు కూడా సరిగ్గా ఇవ్వడం లేదని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు ఏం సమాధానం చెప్పుకోవాలని ప్రశ్నించారు. సర్పంచులు దేవిరెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగరాజు, ఎంపిటిసిలు దేవరాజు, మహిళా ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విలువలు కలిగిన జర్నలిజానికి బాటలు వేయాలి

- ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



నిజాలను నిజాయతీగా రాసినప్పుడే జర్నలిజంలో సంతృప్తి దొరుకుతుందని రాష్ట్ర ప్రెస్అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శుక్రవారం మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విలువలు కలిగిన జర్నలిజానికి బాటలు వేయాలని కోరారు. అసత్యాలు వల్లెవేస్తే అభద్రతతో మానసిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఏదైనా దురదృష్టకరమైన సంఘటన జరిగినప్పుడు బాధితులకు న్యాయం చేసే దక్పథంతో వార్తలు రాసినప్పుడే వారికి న్యాయం చేయగలుగుతామని తెలిపారు. బాషాపరంగా అవగాహనా సదస్సులు, ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశపెట్టడానికి ప్రెస్ అకాడమీ ఆలోచన చేస్తుందన్నారు. తొలుత ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపకులు వానపల్లి సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ సెక్రటరీ ఎం.బాలగంగాధర్ తిలక్, పాత్రికేయులు పాల్గొన్నారు.

వెంకట్ సాయి ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పత్తికొండ



పత్తికొండ పట్టణంలోని వెంకట్‌సాయి ఏజెన్సీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా నాయకులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రంగారెడ్డి ప్రజాశక్తి విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండ పట్టణం చిన్నహుల్తి గ్రామానికి చెందిన అల్లి సాహెబ్ వెంకటసాయి ఫర్టిలైజర్‌షాప్‌లో నందిని సీడ్స్ పత్తివిత్తనాలు కొనుగోలు చేసి ఐదెకరాలలో పత్తి పంట సాగు చేశారని తెలిపారు. పత్తి పంట వేసి ఐదు నెలలు కావస్తున్నా పిందె, పూత, కాయలు లేకపోవడంతో దిగాలు చెందుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన వెంకట సాయి ఏజెన్సీపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు రైతుకు న్యాయం చేయకపోతే రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

నవరత్నాల్లో భూపంపిణీ చేపట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో తీర్మానం
- నాలుగుతీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లో భూపంపిణీ చేర్చి దశరత్నాలుగా భూపంపిణీ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ తీర్మానించింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న మహాసభలో శుక్రవారం నాలుగు తీర్మానాలను ఆమోదించారు. భూసమస్యపై తీర్మానాన్ని కృష్ణా జిల్లాకు చెందిన రాజేష్ ప్రవేశపెట్టగా, కడప జిల్లాకు చెందిన అన్వేష్ బలపర్చారు. ప్రజాపంపిణీ తీర్మానాన్ని నంద్యాలకు చెందిన ఎం.నాగేశ్వరరావు ప్రవేశపెట్టగా, చిత్తూరుకు చెందిన చిరంజీవమ్మ బలపర్చారు. దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులకు సంబంధించిన తీర్మానాన్ని ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కల్యాణ్ ప్రవేశపెట్టగా, తిరుపతికి చెందిన కె.గురవమ్మ బలపర్చారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సమగ్ర చట్టం చేయాలన్న తీర్మానాన్ని ఏలూరు జిల్లాకు చెందిన పివి.రామకృష్ణ ప్రవేశ పెట్టగా కర్నూలు జిల్లాకు చెందిన వీరశేఖర్ బలపర్చారు. భూసమస్య, పంపిణీకి సంబంధించిన తీర్మానంలో పలు డిమాండ్లను పేర్కొన్నారు. దున్నేవానికి భూమి అనే నినాదంతో వామపక్ష పార్టీలు, వ్యవసాయకార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన భూపోరాటాల ఫలితంగా ప్రభుత్వాలు అనివార్యంగా సెంటో, కుంటో పేదలకు భూపంపిణీ చేశాయని, అయితే నేటి ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో ఆ భూములను బలవంతంగా లాక్కుని కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు, భూస్వాములకు దారాదత్తం చేస్తున్నాయని విమర్శించారు.కోనేరు రంగారావు సిఫార్సుల ప్రకారం భూమిలేని ప్రతి కుటుంబానికీ రెండెకరాలు భూమి పంచాలని, పేదల సాగులో ఉన్న భూములకు, నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములకు 9-77 చట్టప్రకారం ఆక్రమణదారుల నుంచి తీసుకుని తిరిగి పేదలకు ఇవ్వాలని కోరారు. జిఒ నెం 250-2018 ప్రకారం అసైన్‌మెంట్ కమిటీలు పునరుద్ధరించి భూపంపిణీ చేపట్టాలని, ఆక్రమణదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని విజ్ఞప్తి చేశారు. 2013 భూసేకరణ, పునరావాస చట్టం ప్రకారం రైతుల నుండి ప్రభుత్వం తీసుకుంటున్న భూములకు మార్కెటు ధర కంటే నాలుగురెట్లు నష్టపరిహారం చెల్లించాలని, పునరావాస నిమిత్తం వయోజనులందరికీ, కుటుంబ సభ్యులకు రూ.ఐదు లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



మహాసభ సందర్భంగా సంఘ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నేత పాటూరు రామయ్య

1973 భూసీలింగ్ చట్టప్రకారం నీటిపారుదల సౌకర్యం కల్పించిన భూముల వర్గీకరణతో మార్పు తెచ్చి అదనపు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. పిడబ్ల్యుడి, ఆర్‌అండ్‌బి, ప్రభుత్వ పోరంబోకు భూములు, పంచాయతీ స్థలాల్లో భూస్వాములు 99 సంవత్సరాల లీజు పేరుతో అనుభవిస్తున్న లక్షలాది కొబ్బరి చెట్ల లీజును రద్దుచేసి దళితులకు, భూమిలేని నిరుపేదలకు కనీసం పది చెట్లు తక్కువ కాకుండా ఇవ్వాలని కోరారు. భూదాన ఉద్యమ భూములకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బోర్డును ఏర్పాటు చేసి బినామీ పేర్లతో భూములను ఆక్రమించిన వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని, భూపంపిణీకి ప్రత్యేక రెవెన్యూ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణాల అభివృద్ధికి గ్రామీణ ప్రాంతాలను విలీనం చేసిన చోట అర్బన్ భూ సీలింగ్ చట్టాన్ని అమలు చేయాలనే పలు డిమాండ్లు తీర్మానంలో పొందుపరిచారు.

ఆపద మిత్రలకు శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్: ఆపద మిత్రలకు ఈనెల 9 నుంచి 20 వరకు శిక్షణ ఇస్తున్నామని జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి తెలిపారు. డైరెక్టర్ ఎపిఎస్ఐఆర్‌డిపిఆర్ , ఎపిఎస్‌డిఎంఎ వారి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో ఎంపిక చేసిన 150 మంది ఆపద మిత్రల (కమ్యూనిటి వాలంటీర్లు , ఆశా వర్కర్ల) కు విపత్తుల ఎదుర్కోవడంలో సంసిద్ధత పై 12 రోజుల రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ లోని డిపిఆర్‌సిలో జిల్లా కలెక్టర్ ఎపిఎస్‌డిఎంఎ , ఎపిఎస్ఐఆర్‌డిపిఆర్ వారిచే మొదటి విడతలో బ్యాచు మొదట బ్యాచ్ 50 మంది ఆపద మిత్ర వాలం టీర్లకు , బ్యాచ్ 2 కి 50 మంది ఆపద మిత్ర వాలంటీర్లు మొత్తం 100 మంది ఆపద మిత్ర వాలంటీర్లకు ఈనెల 9 నుంచి 20 వరకు శిక్షణా కార్య క్రమం ఉంటుందిని జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆపద మిత్ర వాలంటీర్లగా చేయుటకు ఎస్‌డిఆర్ఎఫ్, ఫైర్, ఎన్‌డిఆర్ఎఫ్, రెడ్‌క్రాస్, రెవెన్యూ,పోలీస్, ఫారెస్టు, ఇరిగేషన్, డిఎంహెచ్ఒ, డిఆర్‌డిఎ, ఎనిమల్ హస్‌బెండరీ, ఫిషరీష్ తదితర డిపార్టుమెంట్లు వివిధ రంగాలలో వరదలు, తుఫానులు అగ్ని ప్రమాదాలు, భవనాలు కూలినప్పుడు, విష పురుగులు కరిచినప్పుడు, గ్యాస్ , ఆయిల్ మొదలైన ప్రమాదాల అన్నిటి తీవ్రతను తగ్గించి, ఉపశమనం కల్గించటానికి సుధీర్ఘంగా 12 రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తామన్నారు.

అదే విధంగా కరోన సమయంలో వాలంటీర్లు , ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి మందులు అందిం చటంలో కీలకం పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను వాలంటీర్ కు కేటాయించబడిన కుటుం బాలకు ప్రతి స్కీం అందించడంలో చాలా ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం జిల్లా పంచా యితీ అధికారి నాగరాజ నాయుడు మాట్లాడుతూ మీరు ఈ శిక్షణా కార్య క్రమంలో నేర్చుకున్న దానిని మీ ప్రాంతంలో ఉన్న ప్రజలకు అవగాహన కల్పిం చాలని చెప్పారు. డిపిఎం డిజాస్టర్ మేనేజ్మెంట్ అనుపమ, డిఎల్‌పిఒ తిమ్మక్క, గిడ్డేష్ ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేశ్ , రిసోర్సు పర్సన్లు, డిపిఆర్‌సి సహాయకులు రాజవర్ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి



ఐడ స్కాడ్డర్ వైద్య సేవలు ప్రశంస నీయం

ఘనంగా సోఫియా స్కాడ్డర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

కర్నూలు కోల్స్ కాలేజీ హాల్స్‌లో కజిన్స్ ఫర్ క్రైస్ట్ , అక్కర్ మాన్ కాల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ ఐడ సోఫియా స్కాడ్డర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రెవరెండ్ పాల్ ఆగస్టిన్ , రెవ రవి కుమార్ , కోల్స్ ఫౌండేషన్ అధ్యక్షులు పి.విజయ్ కుమార్ , కార్యదర్శి రమేష్‌పాయి ,కోల్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఝాన్సీ , సిమన్ పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ అమెరికా దేశం నుండి వైద్యులుగా మన ప్రాంతానికి వచ్చిన సోఫియా స్కాడ్డర్ ఇక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితి గమనించి ప్రజల వైద్యం కొరకు ఎద్దుల బండి మీద తొలి వైద్య శాల ను ఏర్పాటు చేసుకున్న ఐడా మహిళలకు ప్రత్యేకంగా వైద్యం అదించారని, తక్కువ సమయంలో ఆసుపత్రిని కట్టించారన్నారు. ఇప్పటి వెల్లూరు క్రిస్టియన్ వైద్య కళాశాల ఆసుపత్రి , అనేక రకాల వైద్య విభాగాలు ఉన్నాయన్నారు. దేశం లోని పలు రాష్ట్రాల నుండి రోగులు ఇక్కడ వైద్య చేసుకుని వెళ్తారన్నారు. స్వాతంత్ర్య రాక మునుపు మన దేశంలో ఐడా స్కాడ్డర్ సేవలు ప్రశంసనీయమని అన్నారు. అనంతరం ఐడా సోఫియా స్కడ్డర్ జయంతి సందర్భంగా వికలాంగులకు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో జేసన్ డేనియల్ పాల్గొన్నారు..

ఎస్‌సి, ఎస్‌టిలకు అండగా నిలుస్తా

డివిఎంసి సభ్యులుగా శాంతికుమార్ ఎన్నిక

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



జిల్లాలోని ఎస్సీ ఎస్టీ లకు అండగా నిలుస్తానని నూతనంగా ఎన్నికైన జిల్లా ఎస్‌టి, ఎస్‌సి విజిలెన్స్ మానిటరింగ్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్ సభ్యులు కాకర్ల శాంతి కుమార్ అన్నారు. వైసిపిలో చురుకుగా పార్టీ ఆదేశించిన కార్యక్రమాలలో పాల్గొంటూ తనదైన శైలిలో వ్యవహరించే వ్యక్తిత్వం శాంతికుమార్ కు ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులుగా ఎంపికకావడంతో జిల్లాలో ని పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. శాంతి కుమార్ మాట్లాడుతూ తన ఎంపిక పట్ల కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, జిల్లా మంత్రులకు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీ ఎస్టీలకు బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన వ్యక్తిగా జగన్మోహన్ రెడ్డి నిలుస్తారన్నారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని అధ్యయనం చేసి ప్రభుత్వ దృష్టికి ప్రజాప్రతినిధుల దృష్టికి అధికారుల దృష్టికి తీసుకువెళతానని పేర్కొన్నారు.



నూతన డివిఎంసి సభ్యులుగా కె. ప్రభుదాస్ నియామకం

ఎస్‌టి, ఎస్‌టిల అభ్యున్నతి కృషి చేస్తా

నూతన డివిఎంసి సభ్యులుగా కె. ప్రభుదాస్ నియామకం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని డివిఎంసికి నూతనంగా ఎన్నికైన కె.ప్రభుదాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలు నగరంలోని రాయల్ ఫంక్షన్ హాలులో ఆయన కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పార్టీ శ్రేణులు ప్రభుదాసును, ఎమ్మెల్యేను భారీ పూలమాలతో సన్మానించారు. ప్రభుదాస్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌సిల అభ్యున్నతి కోసం తన వంతు సాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఎదురయ్యే అస్పృశ్యత, అసమానత, ఇతర ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి అండగా నిలుసుబడతానని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ఎస్సీల, ఎస్టీల పట్ల చూపుతున్న ఆదరరాభిమానాలకు తాను ఎప్పుడూ రుణపడి ఉంటాను అన్నారు. ఎమ్మెల్యే చొరవతో ఎస్సీలకు డిప్యూటీ మేయర్ సహా పలు అనేక ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించారని చెప్పారు. ఇది కేవలం వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి రైల్వే ప్రసాద్, వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు జమ్మన్న, చిన్నబాబు, నవీన్, అరుణ్, మైనార్టీ నాయకులు గఫూర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లిములతో కలిసి భోజనం చేస్తున్న టిజి.భరత్

మంచి చేయాలన్నదే అన్ని మతాల సందేశం

టిడిపి కర్నూల్ ఇన్చార్జి టిజి .భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మతాలు వేరైనా సమాజానికి మంచి చేయాలన్న సందేశం, సంకల్పం మాత్రం ఒక్కటేనని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. కర్నూలు తోహిద్ మజీద్‌లో జుమ్మా ప్రత్యేక ప్రార్ధనల్లో టిజి. భరత్ శుక్రవారం పాల్గొన్నారు. నగరంలోని మాసుంభాష దర్గా సమీపంలోని తోహిద్ మజిద్‌లో జుమ్మా ప్రత్యేక ప్రార్ధనకు టిజిభరత్ హాజరయ్యారు. ముస్లీమేతరులు ప్రత్యేకంగా పాల్గొన్నారు. తెలుగులో ప్రత్యేకంగా సందేశాన్ని ఇచ్చారు. పవిత్రగ్రంథమైన ఖురాన్ తెలుగు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించే ప్రత్యేక జుమ్మాను తనను ఆహ్వానించడం సంతోషకరమన్నారు. హిందూ, ముస్లీం, క్రిస్టియన్ మతాల పద్ధతులు వేరైనా అందరి సందేశం ఒక్కటేనన్నారు. తాము ఎలాంటి కార్యక్రమాలకు ఆహ్వానించినా వెళతామన్నారు. అనంతరం ముస్లీంలు, ముస్లీమేతరులతో కలిసి టిజిభరత్ అక్కడే భోజనం చేశారు. హఫీజ్ అబూబాకర్ ఓమరీ, హఫీజ్ ఇబ్రహీం అసరీ, హఫీజ్ మహ్మద్, టిడిపి నేతలు హమీద్, మన్సూర్ఆలీఖాన్, జహంగీర్, మెహబూబ్‌ఖాన్, రవి, ఈశ్వర్, పెంచులయ్య పాల్గొన్నారు.

సాయి గౌతమీ హాస్పిటల్ యజమాన్యంపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని ఆర్‌టిసి బస్టాండ్ నుండి పోయే డ్రైనేజీ కాలువను సాయి గౌతమి హాస్పిటల్ యాజమాన్యం బందు చేయడం వలన మురుగు చెరువును తలపించే విధంగా మారిన ఈ ప్రాంతాన్ని సిపిఎం కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ .సాయి బాబా, పార్టీ నగర కమిటీ సభ్యులు కె. ప్రభాకర్, ఎస్. మొహమ్మద్ రఫీ, ఆటో వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు హుస్సేన్ వలి, ఎస్.మాబులాల్, స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఆర్‌టిసి బస్టాండ్ నుండి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన డ్రైనేజీ కాలువను గత నెల రోజుల నుండి సాయి గౌతమి హాస్పిటల్ యజమాన్యం బందు చేయించడంతో డ్రైనేజీ నీరు నిలబడిపోయి ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో మురుగు చెరువులా ఏర్పడి దుర్వాసనతో దోమలతో చుట్టుపక్కల ఉన్న ప్రజలు వ్యాపారస్తులు ప్రయాణికులు హాస్పటల్లో ఉన్న పేషెంట్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నెల రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నా ఆర్‌టిసి అధికారులకు గానీ కార్పొరేషన్ అధికారులకు కానీ ఏమాత్రం పట్టడం లేదని అన్నారు. ఈ వార్డుకు కార్పొరేటర్ లేకపోవడంతో ప్రజలు ఈ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. తక్షణమే కమిషనర్ జోక్యం చేసుకొని డ్రైనేజీ కాలువను బంద్ చేయించిన సాయి గౌతమి హాస్పిటల్ యాజమాన్యంపై చర్య తీసుకుని డ్రైనేజీ నీరు పోయే విధంగా చేసి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే చుట్టుపక్కల ప్రజలను వ్యాపారస్తులను సమీకరించి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో స్థానిక వ్యాపారస్తులు ప్రజలు పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న మురుగు కాలువను చూపుతున్న రాముడు, సాయిబాబ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సుమలత తదితరులు

కార్మిక, కర్షక వృత్తి కుటుంబాలకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- కర్నూల్ జిల్లా పరిషత్

కర్నూలు కర్నూలు సామాజిక సేవా కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీఉల్లా రోజా దర్గా వీధి మీసాల సుమలత ఆధ్వర్యంలో శుక్రవారం 48 వార్డు రోజా దర్గా వీధిలో ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు కిరాణా సరుకులు, బియ్యం, కందిపప్పు , కూరగాయలు ఉచితంగా అందజేశారు. రోజు కూలి పనులతో జీవనం గడుపుతున్న వారికి దాతలు సహాయ సహకారాలు ఉపాధి అందించాలని కోరారు. సామాజిక సేవా కార్యక్రమంలో కర్నూలు సామాజిక సేవా కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీఉల్లా, మీసాల సుమలత, ఉప కార్మిక కమిషనర్ కె.వెంకటేశ్వర్లు కార్మిక అధికారి కేశన్న, కెడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ బండారు శ్రీనివాసులు, వాసవి క్లబ్ సభ్యులు హరినాగప్రసాద్ శెట్టి ,నారాయణ రామస్వామి కర్నూలు నగర సమాజ సేవకులు రోజా వీధిలో కిరాణా సరుకులు పంపిణీ చేశారు.

కంపుకొడుతున్న కర్నూలు బస్టాండు పరిసర ప్రాంతాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్ పరిసర ప్రాంతాలు వ్యర్థ పదార్థాలు మురికి నీటితో కంపు కంపుగా మారింది. ప్రధానంగా ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలోని అనుపమ హోటల్‌లోని వ్యర్థపదార్థాలు, మురుగునీటి వ్యవస్థ ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు బస్టాండ్ లోపల పార్కులోకి చేరి దోమలకు దుర్వాసనకు నిలయంగా మారింది. ఈ కంపు దోమల విడతతో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. బస్సులు బయటకు వెళ్లే దారి వద్ద పక్కన ఉన్న పండ్ల దుకాణాలు వెనుక భాగాన ఉన్న షాపుల లోకి మురుగునీరు చేరి పండ్ల దుకాణాల వారు వ్యర్థాలు అన్ని అక్కడ వేయడంతో ఆ నీరు పచ్చగా మారి దుర్గాన్ని వెదజల్లుతుంది. కొల్లాపురం బస్సులు ఆగే ప్రదేశంలో కూడా డ్రైనేజీ నిండి మురుగునీరు పైకి వస్తుంది. ప్రయాణికులు దీనితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగునీరుపై వాలిన దోమలు, ఈగలు బస్టాండ్ ఆవరణలో తిరుగుండారాలపై వాలడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఆర్‌ఎం వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మరో కాలువలను శుభ్రం చేయించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ప్రయాణికుల కోరుతున్నారు.







పోతుల నాగరాజును గెలిపించాలని ప్రచారం చేస్తున్న షరీఫ్ తదితరులు

పోతులనాగరాజును ఎమ్మెల్సీగా గెలిపించండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోతుల నాగరాజును గెలిపించాలని విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల నాయకులు ప్రచారం చేశారు. ఒకటవ వార్డు ఖండేరివీధి,చితంబరరావు ంబరావువీధి, రామారావుగేట్ పట్టభద్రులకు సిఐటియు కర్నూలు నాయకులు శుక్రవారం ప్రచారం చేస్తూ పోతుల నాగరాజును పిడిఎఫ్, యుటిఎఫ్, వామపక్ష పార్టీలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి, పోతుల నాగరాజును గెలిపించాలని పట్టభద్రులైన ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నగర నాయకులు ముహమ్మద్ షరీఫ్, వెంకటేశ్వర్లు, రాజేంద్రబాబూ మాట్లాడుతూ నీతి, నిజాయతి, నిబద్ధతకు మారు పేరుగా ఉండి ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పని చేస్తున్న పి.నాగరాను గెలిపించాలని కోరారు.



పత్తికొండలో కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ హుమతలత, భార్గవిరెడ్డి , తదితరులు

వైఎస్ భారతి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతి జన్మదిన వేడుకలను పోచమి రెడ్డి సేవాదళ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలు వైసిపి నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పోచిమిరెడ్డి సేవాదళ్ సభ్యులు పత్తికొండ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ హేమలత , మురళీధర్ రెడ్డి కూతురు భార్గవి రెడ్డి, ఎంపిటిసిలు అనిత, సరోజ వార్డు మెంబర్లు బోడ సావిత్రి, రాజేశ్వరి, లైట్ నాగరాజు , మాజీ ఉపసర్పంచి కోటేశ్వరరావు, గోవిందరాజు, బోడశీను పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-తుగ్గలి

ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సచివాలయం ఆరోగ్య కార్యదర్శి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి, మారెళ్ల, రాంపల్లి, రాంకొండ తదితరుల గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో డ్రై డే ఫ్రైడే లో భాగంగా ముగురు కాలువలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పరిసరాలు పరిశుభ్రతతో పాటు, దోమల కాటు నుండి తప్పించుకోవాలన్నారు. మలేరియా, డెంగు, అతిసార తదితర రోగాల లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలన్నారు. వాటికి సంబంధించిన మందులన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు. దోమల కాటు వల్ల వచ్చే రోగాలకు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. మురుగు కాలువలో చెత్తా చెదారం ఉండకుండా గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.





లక్ష్మయ్య చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఇళ్ల పట్టాలకు భూసేకరణ

- రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీ - కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇళ్ల పట్టాల మంజూరుకు ప్రభుత్వ భూములు లేని మండలాల్లో భూసేకరణ జరపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత మండల తహశీల్దార్లు, ఆర్డిఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ టి. నిశాంతితో కలిసి 90 రోజుల ఇళ్ల పట్టాలు, భూ హక్కు పత్రాల పంపిణీ, మ్యుటేషన్ దరఖాస్తులు, పిఓఎల్ఆర్ రీసర్వే, జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం, స్పందన అర్జీలు, పౌర సరఫరాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై అన్ని మండలాల తహశీల్దారులు, ఆర్డీవోలతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు లేని మండలాల్లో ఇళ్ల పట్టాల మంజూరు కోసం ప్రభుత్వ భూములు గుర్తించాలని తహశీల్దార్లను ఆదేశించారు. మొదటి విడతలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసి పొజిషన్ చూపించినప్పటికీ వెళ్లకపోతే సంబంధిత లబ్ధిదారుల ఇళ్ల పట్టాలను రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం రీసర్వే పూర్తయిన గ్రామాలలో భూ హక్కు పత్రాల పంపిణీకి సంబంధించి మ్యూటేషన్ కరెక్షన్స్, క్లరికల్ కరెక్షన్స్, మిస్ మ్యాచింగ్, రాంగ్ ఖాతా నంబరు, సర్వేనెంబర్ మిస్సింగ్ తదితర లోపాలను పూర్తిస్థాయిలో నిర్ధారించుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రీ సర్వే పూర్తయిన 8 గ్రామాల్లోకి సంబంధించి ఇప్పటివరకు కేవలం 30 శాతం మాత్రమే భూ హక్కు పత్రాల పంపిణీ జరిగిందన్నారు. లోపాలను సవరించి నిజమైన అర్హుదారులకు భూ హక్కు పత్రాల పంపిణీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ మండల తహశీల్దార్లను ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించి 74 కొత్త కేసులకు 5 కౌంటర్ ఫైల్, 23 కంటెంప్ట్ కేసులు, 118 ఫైనల్ ఆర్డర్ కేసులు వున్నాయని, సంబంధిత కోర్టు కేసులపై దృష్టి సారించి క్లియర్ చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి మాట్లాడుతూ చుక్కల భూములకు సంబంధించి సర్వే నెంబర్ల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత ఆర్డీవోల ద్వారా పంపాలని ఆమె ఆదేశించారు. 340సి, 340బి, 167కె జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, యం.దాసు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు, అన్ని మండలాల తహసీల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

ఇప్పుడు వున్న ఉపాధ్యాయ సంఘాలకు, ఉపాధ్యాయ ఉద్యమాలకు అధ్యుడు,పితా మహుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని యుటిఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి. ప్రసాద్, జె.సుధాకర్‌లు అన్నా రు. నేటికీ చెన్నుపాటి లక్ష్మయ్య మరణించి 54 సంవత్సరాలు గడిచిపోయిందని అన్నారు. ఆయన నడిచిన అడుగు జాడలులో నేటి తరం ఉపాధ్యాయులు నడవడమే అయనకు అర్పించే నిజమైన నివాళి అని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో జాకీర్ హుస్సేన్, రాంమోహన్, బాలస్వామి, రామకృష్ణుడు, మహమ్మద్ కాసీం, గోపాల్, ఫిదా, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, రవి,శ్రావణ్,శేఖర్ మున్సిపల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నియామకం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుల నియమిస్తూ జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా ఎంపీ, ఎమ్మెల్యే, ఎంఎమ్మెల్సీలు, జిల్లా ఎస్పీతో పాటు గెజిటెడ్ అధికారులు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పి. జయరావు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ బి. రాజు నాయక్, జిల్లా అగ్నిమాపక అసిస్టెంట్ అధికారి ఎస్. జయన్న సభ్యులుగా వ్యవహరిస్తారు. నాన్ అఫీషియల్ మెంబర్లుగా సింగరి జీవన్ రాజు, నడిమిండ్ల రమేష్, చిటికెల సలోమి, ఎస్. దిలీప్ రాజు, మేఘవత్ అశోక్ నాయక్ నియమితుల య్యారు. ప్రభుత్వేతర సంస్థ (స్వచ్ఛంద సంస్థ)నుంచి ఓ. మమత, నందవరం శ్రీనివాసులు ను ఎన్నుకున్నారు. వీరి కాలపరిమితి రెండు సంవత్సరాలు, కమిటికి సభ్య కార్యదర్శిగా జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారత అధికారి వ్యవహరిస్తారు. కమిటి నిర్వహించే సమావేశాలకు జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇతర అధికారులు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి ఒక ప్రకటనలో తెలిపారు.

లింగ వివక్షను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

లింగ వివక్ష ఏ రూపంలో ఉన్న సహించరాదని వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణ బదులు కావాలని పలురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కాలేజీలోని వివేకనంద ఆడిటోరియంలో నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని రూరల్ పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలకు లింగ వివక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ సిడిపిఓ చంద్రకళ నంద్యాల రూరల్ సీడీపీఓ ఉషారాణిల ఆధ్వర్యంలో జరిగింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ లీలావతి సామాజిక పరివర్తన మార్పు జిల్లా సమన్వయకర్త బి . విజయకుమార్,వరల్డ్ విజన్ కో..ఆర్డినేటర్ తరుపతి రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సామాజిక పరివర్తన మార్పు జిల్లా సమన్వయకర్త బి. విజయ కుమార్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు - పేదరిక నిర్మూలన, ఆకలిని అంతం చేయడం, మంచి ఆరోగ్యము శ్రేయస్సు, నాణ్యమైన విద్యా ప్రయోజనాలు మంచిపని ఆర్థిక వృద్ధి సృష్టించడం వంటి లక్ష్యాలను. సాధించాలంటే ముందుగా “లింగ సమానత్వ ము అనే సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని సాధించాల న్నారు. అనంతరం ఐసీఐడీఎస్ పీడీ లీలావతి మాట్లాడుతూ లింగ వివక్ష ఏ రూపంలో ఉన్న సహించరాదన్నారు. మాసిక హింస , వివక్ష శారీరక హింస గృహహింస, ఈవ్ టిజింగ్ పోక్సో యాక్ట్ బాల్య వివాహాల నివారణ, దిశా యాప్ వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. వ్యాసరచనలో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం బాలవివాహాల నిర్మూలన లింగ వివక్షను నిర్మూలిద్దాం అంటూ పోస్టర్‌ను ఆవిష్కరించారు



లింగ వివక్షపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, అనుబంధ సంస్థలపై నిషేధం

- జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కొన్ని సంస్థలను నిషేధిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల సంస్థలుగా కేంద్రం గుర్తిస్తూ కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ నోటిఫకేషన్ విడుదల చేసిందని జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు,రిహాబ్ ఇండియా ఫౌండేషన్, క్యాంపస్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా,అల్ ఇండియా ఇమామ్స్ కౌన్సిల్, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్,నేషనల్ ఉమెన్స్ ఫ్రంట్, జూనియర్ ఫ్రంట్, ఎంపవర్ ఇండియా ఫౌండేషన్, రిహాబ్ ఇండియా ఫౌండేషన్ కేరళ.వంటి సంస్థలను చట్టవిరుద్ధ కార్యకలాపాల సంస్థలుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అన్లా ఫుల్ యాక్టివిటీ, ప్రివెన్షన్ యాక్ట్ 1967 ప్రకారం కేంద్ర ప్రభుత్వం తేదీ 27 సెప్టెంబర్ 2022న నిషేధం విధించిందని ఇటువంటి సంస్థల యొక్క కార్యకలాపాలు ఎవరైనా నిర్వహించిన, ప్రోత్సహించిన అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి హెచ్చరించారు.





క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

అట్టహాసంగా..

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా ఖోఖో క్రీడా పోటీలు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నాడు అటహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే శిల్పా చక్ర పాణి రెడ్డి తనయుడు శిల్పా కార్తీక్ రెడ్డి ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కర్నూల్ నంద్యాల జిల్లాకు చెందిన క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటమును సమానంగా స్వీకరించాలని, క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని అన్నారు. సాయంత్రం ఆత్మకూరు పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు ప్రైవేట్ పాఠశాలలు చెందిన విద్యార్థిని విద్యార్థులతో క్రీడాజ్యోతి ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. అనంతరం క్రీడా మైదానంలో క్రీడాకారుల ఫాస్ట్ మార్చును శిల్పా కార్తీక్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు క్రీడాకారులు వందన స్వీకరణను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణం లాంటి వెనుకబడ్డ ప్రాంతంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరగడం అభినందనీయమని, క్రీడా అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూర్ ఆర్డీవో దాసు, ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, జడ్పిటిసి సభ్యుడు శంకర్ రెడ్డి, ఎంపీపీ నల్లకాల తిరుపాలమ్మ, ఆత్మకూరు మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్, కౌన్సిలర్లు విజయ్ చౌదరి, పువ్వాడ భాస్కర్, మారుబోతుల విజయ్, సుల్తాన్, యూనిస్, అంజాద్ అలీ, పాఠశాల హెచ్ఎం సక్రు నాయక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘు, రామాచార్యులు, పీఈటీలు ప్రభాకర్, సుబ్బారెడ్డి, శంకర్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం గంజి రాజశేఖర్, వసుంధర, వైఎస్ఆర్పిపి నాయకులు రాజమోహన్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితం అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోనే ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మూడు హెయిర్ బస్సులను ప్రారంభించారు. బనగానపల్లె డిపోకు చెందిన రెండు బస్సులు, కోవెలకుంట్ల డిపోకు చెందిన ఒక బస్సును ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని, ప్రయాణికులు ఆటోలలో, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు ఆర్టీసీ సమస్త నష్టాల్లో ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వ పరం చేశారని తెలిపారు. ఆర్టీసీని రక్షించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నూతనంగా ప్రారంభించిన రెండు ఆర్టీసీ బస్సులు బనగానపల్లె నుండి నంద్యాలకు రోజుకు 8 సింగల్ నడపనున్నట్లు తెలిపారు. కోయిలకుంట్ల నుండి నంద్యాలకు నూతన బస్సును ఇప్పనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కరోనాలో కొన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులను రద్దు చేయడం జరిగిందని, తిరిగి ఆ గ్రామాలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే తెలిపారు. బనగానపల్లి నుండి శ్రీశైలానికి ఎక్స్ప్రెస్ సర్వీస్ ను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ రామయ్య, ఆర్టీసీ డిఎం రవి కిషోర్, అసిస్టెంట్ డిఎం షఫీ డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటన్న, యాగంటి దేవస్థానం చైర్మన్ తోటా బుచ్చిరెడ్డి వైసీపీ నాయకులు పాతపాడు వెంకటేశ్వర రెడ్డి, కుమ్మరి సురేష్ బాబు, సుదర్శన్ రెడ్డి, ఖానిక్,అల్లీ హుస్సేన్, సుబ్బ రాయుడు తదితరులు పాల్గొన్నారు.



జండా ఊపి ఆర్టిసి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

రేవనూరు ఆరోగ్య కేంద్రంను డిఎంహెచ్ఓ తనిఖీ

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి, రోగులను, గర్భిణులతో మాట్లాడారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

బ్రిడ్జి నిర్మాణంలో .. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్

- జడ్పిటిసి సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న తహసిల్దార్ కార్యాలయం ముందు నిర్మించిన బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా అధికారులు కాంట్రాక్టర్ కుమ్మక్కై బిల్లులు స్వాహా చేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారని కొత్తపల్లి జెడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న తరుణంలో అధికారులు కాంట్రాక్టర్ కుమ్మక్కై నిర్మించిన బ్రిడ్జి పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా బ్రిడ్జి నిర్మించి బిల్లులు స్వాహా చేశారని ఆరోపిస్తున్నారు. అలాగే నిర్మించిన బ్రిడ్జి నిర్మాణం ఉపయోగం లేకుండా కొద్దిపాటి వర్షం వచ్చిన పాత పద్ధతి లాగానే ప్రభుత్వ కార్యాలయాల్లోకి ప్రజల ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరుతుందని సంబంధిత కాంట్రాక్టర్‌కు అధికారులకు సమస్యను వివరించిన నిర్లక్ష్య ధోరణి వహించి అలాగే నిర్మించడం ప్రజాధనం దుర్వినియోగం అయిందని మండిపడ్డారు. ఆత్మకూరు ప్రధాన రహదారి నుంచి శివపురం వరకు గుంతలకు తారు వేస్తున్న పనుల్లో కూడా సంబంధిత అధికారులు లేకుండా ఇష్టరాజంగా పనులు పూర్తిచేయడంపై వారు మండిపడ్డారు. వెంటనే సంబంధిత జిల్లా అధికారుల స్పందించి నిర్మించిన వంతెన నిర్మాణ పనులు గుంతలకు తారు వేస్తున్న పనులను క్వాలిటీ కంట్రోల్ ఆధ్వర్యంలో పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని తెలిపారు.



పరిశీలిస్తున్న జడ్పిటిసి సుధాకర్ రెడ్డి

వైసిపి పాలనకు చరమగీతం పాడండి : టిడిపి

ప్రజాశక్తి - చాగలమర్రి

వైసిపి ప్రభుత్వ దుష్ట పాలనకు చరమగీతం పాడాలని మాజీమంత్రి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్న భోదనం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గ్రామంలోని ప్రతి కాలనీ, ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ ఏ గ్రామంలో పర్యటించిన ప్రజలు స్వచ్ఛందంగా స్వాగతం పలుకుతున్నారన్నారు. ఈ దుర్మార్గపు వైసీపీ పాలనకు త్వరలోనే చరమ గీతం పాడుతామని సామాన్య ప్రజలు సైతం ముందుకు వస్తున్నారని మాజీ మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి,టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ భాష టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు,టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచెర్ల నగర పంచాయతీలోని ప్రజలకు కష్టపూరిత పరిపాలన కొనసాగించడం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డికి తగదని, బేతంచెర్ల తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యదర్శి కాకర్ల షేక్షావలి చౌదరి అన్నారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ రాంగోపాల్, రూబెన్ ల ఆధ్వర్యంలో శుక్రవారం నాడు 16వ వార్డులో టిడిపి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో వాణిజ్య కమిటీ మెంబర్ రేగటి భీమారెడ్డి, బుగ్గనపల్లి రమేష్, కొలుములపల్లి రమేష్, శ్రీనివాస గౌడ్, వెంకట స్వామి, నంద్యాల మధు, రామవరం శివ, మేకల నాగరాజు, సెటిల్మెంట్ శెట్టి కానాల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని టిడిపి నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని 6వ వార్డు నందు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆర్థికశాఖమంత్రి ఓడిపోతాననే భయంతో తెలుగుదేశంపార్టీ నాయకులను బెదిరింపులకు గురి చేయడమే వారి పాలన సరిపోయిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి ఓటు వేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, నంద్యాల జిల్లా టిడిపి అధికార ప్రతినిధి విజయ్ భట్, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున డోన్ పట్టణ టిడిపి తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కేబుల్ కిరణ్, మైనారిటీ కమిటీ సభ్యులు అలీబాబా,బిసి కమిటీ సభ్యులు నీలం ప్రభాకర్, బిసి సెల్ కమిటీ సభ్యులు జిలేబి ధను, లారీల బాష, జీవన్, గంధం చరణ్, రామాంజనేయులు, మల్లిఖార్జున ,చంద్ర, మెకానిక్ బాష, కేబుల్ మురళీ, షాషా, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అఖిల



డోన్‌లో..



నాగరాజుని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న పెరుగు శివ కృష్ణ

ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించండి

- బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి యువజన సమైఖ్య

ప్రజాశక్తి - బనగానపల్లె

పశ్చిమ రాయలసీమ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బలపరుస్తున్న డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి యువజన సమైఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివ కృష్ణ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల,, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్,, ప్రభుత్వ జూనియర్ కాలేజ్,, కస్తూర్బా బాలికల విద్యాలయం,, ఏపీ మోడల్ స్కూల్,,మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కస్బా పాఠశాలల్లో పశ్చిమ రాయలసీమ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పెరుగు శివ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం శాసనమండలిలో పోరాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బలపరుస్తున్న పోతుల నాగరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యల కోసం ప్రజావాణిని వినిపించే వారిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ప్రశ్నించే గొంతుకను గెలిపిస్తే ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రి స్వామి, నాయకులు అజయ్, తరాక్, మనోజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ ఎఒగా ఆయూబ్ బాషా

ప్రజాశక్తి - నంద్యాల

కలెక్టరేట్ జిల్లా వ్యవసాయ శాఖ టెక్నికల్ ఎఒగా అయుబ్ బాషా బాధ్యతలు స్వీకరించారు. బండి ఆత్మకూరు మండలం వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న అయూబ్ బాషాను డిప్యూటేషన్‌పై నంద్యాల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా నియమిస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న టెక్నికల్ స్వాతి బండి ఆత్మకూరు మండలం డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇరువురు మ్యూచువల్‌పై వెళ్లారు.

వికలాంగులకు కృత్రిమ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - నందికొట్కూరు

చాయ్ వి గార్డ్ సేవలు అభినందనీయం అని మున్సిపల్ కమిషనర్ పి. కిషోర్ అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని జై కిసాన్ పార్కులో మరియా నిలయం సాంఘిక సేవా సంస్థ చాయ్ వి గార్డ్ ఫౌండేషన్ సహకారంతో ప్రపంచ దివ్యాంగుల వారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాయ్ వి గార్డ్ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు అందజేయడం హర్షించదగ్గనీయమని అన్నారు. మరియా నిలయం సాంఘిక సేవ సంస్థ సోషల్ డైరెక్టర్ సిస్టర్ సారంగా మాట్లాడారు. తదనంతరం దివ్యాంగ చిన్నారులకు కత్రిమ పరికరాలు (క్యాలిపర్స్) మున్సిపల్ కమిషనర్, మండల విద్యాశాఖ అధికారి ఎస్. ఫైజున్నిసా బేగం,సీడ్స్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ అధ్యక్షులు అచ్చన్న పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ విజయశాంతి, ఐఈఆర్టి విజయ కుమారి, సంజన్న, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఉద్యోగులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి రవి చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు మున్సిపల్ ఆఫీస్ ప్రాంగణం నందు హిమాలయ ఎక్స్‌క్లూజివ్ హెర్బల్ స్టోర్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. బీఎండ్ టెస్ట్‌లు నిర్వహించారు. మునిసిపల్ కమీషనర్ సి రవి చంద్రారెడ్డి, అసిస్టెంట్ కమీషనర్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్, మునిసిపల్ సిబ్బంది పాల్గొని చెక్‌అప్ చేయించుకున్నారు. ఉచిత వైద్య శిబిరంలో మున్సిపల్ కార్యాలయం సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా 600 సర్వీసులు : మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సచివాలయాలకు వచ్చే ప్రజలకు విస్తతంగా సేవలు అందించాలని, రోజుకు 15 సేవలను అందించాలని మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి వార్డ్ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయం నుండి ప్రతిరోజు కనీసంగా 15 సర్వీసులు అందించాలని ఆదేశించారు. కరెంట్ బిల్లులు మున్సిపాలిటీకి సంబంధించిన ఇంటి పన్ను , ఖాళీ స్థలాల పన్ను, నీటి చార్జీలు మొదలుకొని ప్రతిదీ సచివాలయంలోనే కట్టించుకోవలన్నారు. ప్రజలు మున్సిపల్ ఆఫీస్ వద్దకు రావాల్సిన అవసరం లేదని కమిషనర్ తెలిపారు. సమావేశంలో వార్డ్ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రిలో ఉపాధి హామి పథకం కింద రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను జిల్లా ఉపాధి హామి ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రా రెడ్డి శుక్రవారం పరిశీలించారు. చాగలమర్రి గుండా సాగే జాతీయ రహదారిలో రైతులు సాగు చేసిన మునగ,మల్లె తోటలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామి పథకం ద్వారా అందించే సబ్సిడీలు,ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ఉపాధి హామి పథకం ద్వారా ఉద్యాన పంటలు సాగు చేసుకొనేలా అవగాహన కల్పించాలని ఆయన ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపిఓ నిర్మల,ప్లాంటేషన్ మేనేజర్ రషీద్ బాష,ఈసి,టెక్నికల్ అసిస్టెంట్లు,రైతులు షరీఫ్,వలి,జైబున్నిసా,జాబీర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - రుద్రవరం

రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలకు రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థినీలు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత నెల 20వ తేదీన నంద్యాలలో జరిగిన జూనియర్స్ జంప్ రోప్ పోటీలలో ఆదర్శ పాఠశాల నుంచి బి. రాజేశ్వరి, బి. అలేఖ్య, డీ. అమృత, డీ. లక్ష్మి వర్ష, పి.వై ఉష ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 10,11 తేదీలలో నంద్యాల జిల్లా గోవిందపల్లె హైస్కూల్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ పి. శ్రీనివాసులు ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు జాన కిరణ కుమార్,చవాన్,రమణ, ఉపాధ్యాయులు,నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు

రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రాష్ట్రంలోని అన్ని భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేయించి, శాశ్వత పరిష్కారానికి సీఎం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారని రైతులకు మేలు చేసేందుకే వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. ఈ పథకానికి సంబంధించి నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామాన్ని పైలట్ గ్రామంగా ప్రభుత్వం ఎంపిక చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ రాజశేఖర్ బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్ రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ మాట్లాడుతూ రైతులు ఎక్కువ శాతం మంది భూమి వివాదాల్లో కూరుకుంటున్నారని, సర్వే నంబర్లు తేలక, సరిహద్దుల నిర్ధారణ కాక తద్వారా సంపూర్ణ హక్కులు పొందలేక చివరకు ఆ వివాదాలను వారసులకు సైతం అప్పగించాల్సిన పరిస్థితుల్లో రైతులు ఉన్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంగర నవీన్ , రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి , ఎంపీపీ మురళి కృష్ణ రెడ్డి , వైస్ ఎంపీపీ పబ్బతి జ్యోతి, నందికొట్కూరు మండల వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ నగినేల ఉసేనయ్య గ్రామ ఉపసర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ సురేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ చంద్రమౌల బాలస్వామి, మండల వైసీపీ నాయకులు ఉండవల్లి ధర్మారెడ్డి, మండల అభివృద్ధి అధికారి ఎం. శోభా రాణి, డిప్యూటీ తహశీల్దార్ (ల్యాండ్ సర్వే) సత్యనారాయణ, ఈఓఆర్‌డి సుబ్రమణ్యం శర్మ ప్రభుత్వ అధికారులు, గ్రామరైతులు, వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని పాలసాగరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1985-1986 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం అపూర్వంగా జరిగింది. 36 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకొని ఆనందంలో మునిగిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అలాగే పాఠశాల పుస్తకాలు ఉంచుకుని బీరువాను బహుకరించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏవి రామసుబ్రహ్మణ్యం, అంబటి గోపాల్ రెడ్డి, రామారావు, షాకీర్, జాకీర్,రాము ,లక్ష్మణ్, మురళి, నరసింహ ,రాజా, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సహాయం చేస్తున్న దృశ్యం

రైతులకు ప్రభుత్వం సబ్సిడీ పరికరాలు పంపిణీ చేయాలి

- వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి నాగేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రైతులకు ప్రభుత్వం సబ్సిడీ పరికరాలు పంపిణీ చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి నాగేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు వ్యవసాయాధికారులు కొలిమిగుండ్ల వ్యవసాయ కార్యాలయం నందు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి నాగేశ్వర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉన్న రైతులకు ఉపయోగపడే పియుపి నీటి పైపులు మందు కొట్టే స్ప్రేర్లు, ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిలు శారదా దేవి, పవన్ కుమార్, పశువైద్యాధికారిని పద్మావతి, ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు. **శిరివెళ్ల :** మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నందు జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు అధ్యక్షతన మండల



ఆత్మకూరు : మాట్లాడుతున్న అధికారులు

వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈ సుధాకర్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వర్ రెడ్డి, వీఏఏ మోనిషా, ఎంపీఈఓలు నాగరాజు, సురేష్, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, పశు వైద్యాధికారి, సిరివెళ్ల గ్రామ ఉపసర్పంచ్ ఇంతియాజ్, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిసాన్ డ్రోన్స్ సిరివెళ్ల మండలానికి మూడు మంజూరు అయ్యాయని, వీటిని గ్రూప్ కింద ఇవ్వడం జరుగుతుందన్నారు. **ఆత్మకూర్ :** రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నందు శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరికల్చర్ ఏడి నాగేష్ మాట్లాడుతూ పట్టు పరిశ్రమ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, షెడ్డు నిర్మాణానికి ఇస్తున్న రాయితీ వివరాలు తెలియజేశారు. డి ఆర్ సి ఏ ఓ హేమలత మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల మీద యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. ఉద్యానవన అధికారి హరినాథ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ అరుణ తమ శాఖ ద్వారా అమలవుతున్న పథకాల గురించి తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత , ఉద్యానవన అధికారి హరినాథ రెడ్డి , వెటర్నరీ డాక్టర్ శివ సాగర్ రెడ్డి , సిరికల్చర్ అధికారి అరుణ, మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యులు హాజరయ్యారు.

మహిళల చదువు సమాజానికి వెలుగు

ప్రజాశక్తి - శిరివెళ్ల

మహిళల చదువు కుటుంబానికే కాకుండా సమాజానికే వెలుగు ఇస్తుందని ఇఒపిఆర్‌డి సాల్మన్ రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో లింగ వివక్ష నిర్మూలన కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుశీల వసుంధర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మహిళా అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. బాలికలు చదువుకు మధ్యలో బ్రేక్ వేయకుండా ఉన్నత విద్య చదివి ఉత్తమ కొలువు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్నటువంటి అంగన్వాడి టీచర్లు ప్రిన్సిపాల్ జ్యోతి, మహిళా పోలీసులు పాల్గొన్నారు. **నంద్యాల :** నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలోని బాలకాడమీ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పాఠశాల కరెస్పాండెంట్ ఎం.జీ.వి. రవీంద్రనాథ్, మాధవీలత మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2003 అక్టోబర్ 31న ఐక్యరాజ్యసమితి అవినీతికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ ఆమోదించినప్పటి నుండి ఏటా డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ ఎం.జీ.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **సంజామల :** మహిళలపై వేధింపులు నేరమని సంజామల ఎస్సై ప్రతాప్ తెలిపారు. శుక్రవారం కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంత ఆధ్వర్యంలో మహిళలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాల నిర్మూలన, గృహహింస, సైబర్ నేరాలు అనే కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. అనంతరం విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



శిరివెళ్ల : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



బాల అకాడమీ పాఠశాలలో

గ్రామ సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలములోని అంకిరెడ్డి పల్లిలోని గ్రామ సచివాలయం-1, 2లను ఎంపిడివో సుబ్బరాజు, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బంది బయో మెట్రిక్ అటెండెన్స్ ను పరిశీలించారు. గురువారం నాడు మృతి చెందిన మంజుల గోపి అంత్యక్రియలకు వైఎస్సార్ బీమా పథకం కింద మతుని భార్యకు రూ.10 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కవిత,సింధుజ తదితరుల పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 82 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 82 మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శాసన సభ్యులు గంగుల బ్రిజేంద్రరెడ్డి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా మెగా జాబ్ మేళాకు శ్రీకారం చుట్టారు. 200 మంది నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్నారు. 12 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సోమ శివారెడ్డి , మునిసిపల్ కమీషనర్ రమేష్ బాబు, జెడియం కిరణ్, డిఎస్డిఓ ప్రతాప్ రెడ్డి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ దానం, ఏపిఎం రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ కేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి - కొత్తపల్లి

రైతులు పీఎం కిసాన్ నగదు పొందాలంటే ఈ కేవైసీ తప్పనిసరిగా ఉండాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మల్లెల వెంకట శివారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం లోని వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి మహేష్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం కిసాన్ లబ్ధిదారులు ఇంకా ఈ కేవైసీ చేయించుకొనని వారు ఎవరైనా ఉంటే చేయించుకోవాలి అన్నారు. ఎత్తిపోతల పథకాల ద్వారా పంటలకు సాగునీరు అందించాలన్నారు. అనంతరం కొత్తపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో నగదు చెల్లించిన రైతులకు సబ్సిడీపై పైపులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకుడు ఎం శ్రీనివాస్, మత్స్యశాఖ సహాయకుడు అనుక్, పశుసంవర్ధక శాఖ సహాయకుడు రామాంజనేయులు, వ్యవసాయ విస్తరణాధికారి వెంకటనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారిగా పవన్ కుమార్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలం వ్యవసాయ అధికారిగా పవన్ కుమార్ పదవి బాధ్యతలు శుక్రవారం తీసుకున్నారు. కొలిమిగుండ్ల వ్యవసాయ అధికారినిగా పనిచేస్తున్న శారదా దేవి నంద్యాల బదిలీ కావడంతో ఆమె స్థానంలో కోయిలకుంట్ల ఏడి ఆఫీసులో టెక్నికల్ ఏవోగా పని చేస్తున్నా పవన్ కుమార్ నిర్మించడంతో ఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - నందికొట్కూరు

నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ పి కిషోర్ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఎకో డెవలప్మెంట్ (ఎస్ఆర్ఈడి), (ఎస్ఏఆర్‌డిఎస్) పర్యవేక్షణలో యూనిసెఫ్ వారి ఆర్థిక సహకారంతో శుక్రవారం నందికొట్కూరు పట్టణంలో సాపూర్ ఫంక్షన్ హాల్ నందు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



గోడపత్రికలను విడుదల చేస్తున్న డోన్ పట్టణ సీఐ మల్లికార్జున

మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - డోన్

ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ డోన్ మండల కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్ కోరారు. ఈనెల13,14,15,16 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాదులో జరిగే ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని శుక్రవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణంలో డోన్ పట్టణ సిఐ మల్లికార్జున చేతుల మీదుగా గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డోన్ మండల కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ విద్య అభివృద్ధి కోసం, విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ముందంజలో ఉంటుందన్నారు. భవిష్యత్తులో విద్యారంగం ఎదుర్కోబోతున్న పరిస్థితుల పైన సమీక్షించి విద్యాభివద్ధికి కృషి చేయడం కోసం ఈ అఖిల భారత మహాసభలు వేదిక కానున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డోన్ మండల అధ్యక్షులు అశోక్ ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్, మాబు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు షమీం బేగం, డివైఎఫ్ఐ నాయకులు హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - పగిడ్యాల

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ఈ నెల 15వ తేది వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. 2023-2024 సంవత్సరాన్ని గ్రామ పంచాయతీల ప్రణాళిక తయారీకి మండల, గ్రామ స్థాయి, అధికారులకు, జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, మండలంలోని ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 9:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులు, మండలంలోని ప్రజాప్రతినిధులు తప్పకుండా హజరు కావలన్నారు.

పొదుపు మహిళలకు కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని పొదుపు మహిళలకు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఒక్కొక్క పొదుపు మహిళకు 11 కోళ్లు చొప్పున శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎపిఎం సుబ్బయ్య, సీసీలు మాట్లాడుతూ పొదుపు మహిళలకు ప్రభుత్వం ఎంతో సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణారెడ్డి, శంకరయ్య,భాను,స్వామి నాథం, వి.వో.ఏలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

లంపి స్కిన్ లక్షణాలు కనిపిస్తే వెంటనే సంప్రదించండి

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం మేజర్ గ్రామపంచాయతీ గాజులపల్లి గ్రామ పరిధిలోని పాడి పరిశ్రమ పోషన దారులు అందరూ పశువులలో లంపి స్కిన్ వైరస్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సంప్రదించాలని శుక్రవారం గ్రామ పశువైద్యాధిశాఖ అధికారి కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ వాతావరణం మార్పు, ఇదే టైంలో ఈ వైరస్ సోకుతుండడంతో పాడి రైతులు ఆందోళనలో పడ్డారన్నారు. వ్యాధి సోకిన పశువును ఇతర పశువులకు దూరంగా ఉంచాలని పశు వైద్యాధికారి కిషోర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది , పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు పుల్లారెడ్డి గృహప్రవేశానికి శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి శుక్రవారం హాజరయ్యారు. శిల్పా భువనేశ్వర్ రెడ్డి స్వయానా పుల్లారెడ్డి బామ్మర్ది కావడంతో ఆయన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి భువనేశ్వర్ రెడ్డితో హాజరై గ్రామంలోని వైసిపి నాయకులతో సమావేశమై గ్రామంలోని సమస్యలు పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసిపితోనే గ్రామాల అభివృద్ధి : జడ్పిటిసి



గడప గడపకు కార్యక్రమంలో పథకాలను వివరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ప్యాపిలి

వైసీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పిటిసి బోరెడ్డి శ్రీరామరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి,సర్పంచ్ లక్ష్మీదేవి,పుల్లారెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, రాజా నారాయణమూర్తి, మల్లికార్జున్ రెడ్డి అన్నారు. ప్యాపిలి పట్టణంలోని నేసే వీధిలో గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఎటువంటి దలారులకు అవకాశం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫజల్ రహమాన్, కృష్ణారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బోరెడ్డిరఘు అంజి,పెద్దిరాజు, డిటి మారుతి, ఈఓఆర్‌డి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

లబ్ధిదారులకు జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉడుములపాడు,దొరపల్లె గుట్ట జగనన్న కాలనీలలో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరపల్లె గుట్టలో జగనన్న కాలనీలో ప్రభుత్వం తరపున బోరు సౌకర్యం కల్పిస్తామని,అలాగే నీటిని నిల్వ చేసేందుకు సంపులు ఏర్పాటు చేస్తామని, సంపులలో నీళ్ల నిలువ ఉండేదుకు వాటర్ ట్యాంకుల ద్వారా సప్లై చేసి లబ్ధిదారులకు ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తెస్తామన్నారు.జగనన్న కాలనీలో స్థలాలు వచ్చిన ప్రతి లబ్ధిదారుడు ఇల్లు నిర్మించుకోవాలని కోరారు. లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉంటే చైర్మన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ ఈ మనోహర్,ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ సతీష్,హౌసింగ్ డీఈ నాగభూషణ రావు,డి పి హెచ్ ఓ గంగాధర్,మున్సిపల్ ఏఈ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జోలాపురం మీదుగా విద్యార్థి బస్సును నడపాలి

- ఎమ్మెల్యేకు విద్యార్థినిల మొర

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆర్టీసీ డిపోలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కలిసి విద్యార్థినిలు జోలాపురం గ్రామం మీదుగా విద్యార్థి బస్సును నడపాలని కోరారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో నూతన బస్సులను ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని జోలాపురం గ్రామానికి చెందిన విద్యార్థినిలు తాము గ్రామం నుండి రోడ్డుమీదికి రెండు కిలోమీటర్లు నడిచి రావాల్సి వస్తుందని, ఉదయం, సాయంత్రం తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. జోలాపురం గ్రామం మీదుగా మంగంపేటకు వెళ్లే విద్యార్థి బస్సును నడపాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తెచ్చారు. బనగానపల్లె నుండి మంగంపేటకు విద్యార్థి బస్సు జుర్రేరు ప్రాజెక్టు మీద వెళుతుందని తెలిపారు.

జుర్రేరు ప్రాజెక్టు మీదుగా వెళ్లడం వల్ల ఎలాంటి గ్రామాలు లేవని, ఏడు కిలోమీటర్ల దూరం పెరుగుతుందని తెలిపారు. జోలాపురం గ్రామం నుండి మంగంపేటకు బస్ సర్వీస్‌ను నడిపితే జోలాపురం గ్రామంలోని విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని విద్యార్థులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే ఆర్టీసీ డిపో మేనేజర్ రవి కిషోర్‌కు జోలాపురం మీదుగా మంగంపేట విద్యార్థి బస్సును నడపాలని ఆదేశించారు. రూట్‌ను పరిశీలించి వెంటనే బస్సును నడపాలని ఎమ్మెల్యే కాటసాని డిఎంను ఆదేశించారు. దీంతో విద్యార్థినిలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కి కతజ్ఞతలు తెలిపారు.

12న సైన్స్ ఫెయిర్ వైజ్ఞానిక ప్రదర్శన : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల



ఈ నెల 12, 13 తేదీల్లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని ఎంఇఒ పి సుభాన్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సైన్స్ పెయిర్ వైజ్ఞానికి ప్రదర్శనను పగిడ్యాల మోడల్ స్కూలలో నిర్వహించాడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలోని విద్యార్థుల సైన్స్‌కు సంబంధించి తయరు చేసి ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నాలని ఆయన కోరారు.



కౌలు రైతు కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

- కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - గోస్పాడు

అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు గజ్జల పాపన్న కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూస్తేల సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన కౌలు రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న పాపన్న కుటుంబానికి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ అధ్యక్షులు మార్కు తదితరులు శుక్రవారం పరామర్శించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ పాపన్న తాను పండించిన పంటలకు మద్దతు ధర లేకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎన్ చెన్నయ్య, కౌలు రైతు మండల కార్యదర్శి రామకృష్ణ, కే సుబ్బారాయుడు, రాజు, తదిరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బైర్లూటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శుక్రవారం నాడు గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డా.గోపాల్, డా.పవన్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేసి, పలు సూచనలు చేశారు. డా.సి గోపాల్, డా. జి.పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి : చాగలమర్రి గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. ఆళ్లగడ్డ వైద్యురాలు సుధారాణి 45 మందికి పరీక్షలు చేసి సలహాలు , సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అంజలి, ఇమ్రాన్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్వైజర్లు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని బెలుం గ్రామానికి చెందిన బాచం వెంగళరెడ్డి కుమారుడి వివాహానికి నంద్యాల పట్టణంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్ నందు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మండలంలోని కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన విఆర్ వెంకటేశ్వరరెడ్డి కుమారుడి వివాహ ముహూర్తం కార్యక్రమంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి వారి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు.







మాజీ జడ్పిటిసి ఎర్రబోతుల ఉదయ్ భాస్కర్ రెడ్డి మండలంలోని కలవటాల గ్రామానికి కామిని గోపాల్ రెడ్డికి కుమార్తె వివాహానికి హాజరైయ్యారు. వైసిపి నాయకులు మాజీ జడ్పిటిసి ఎర్రబోతుల ఉదయ్ భాస్కర్ రెడ్డి, కామిని తిమ్మారెడ్డి, టిసి వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

జీవ నియంత్రకాల వృద్ధి విధాన ప్రదర్శన

ప్రజాశక్తి-ప్యాపిలి

మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, జడ్పిటీసీ శ్రీరామి రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మ వారి సౌజన్యంతో జీవన నియంత్రకాల వృద్ధి విధాన పదర్శన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఏడిఏ అశోక్ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ విధానంతో శిలీంద్రాలు అభివృద్ధి చెంది, వేరు కుళ్లు, ఎండు తెగులు, కాడాంకులు, లాంటి రోగాలను మొక్కలకు రాకుండా నివారించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షెక్షవలి,హార్టికల్చర్ ఆఫీసర్ కల్యాణి,డోన్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి,సర్పంచ్ చంద్రకళ రెడ్డి,ఏనుగుమర్రి సర్పంచ్ మోహన్,ప్యాపిలి ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, పొదొడ్డి కృష్ణ మూర్తి,విద్యుత్ శాఖ అధికారి వినయ్ కుమార్,వెటర్నరీ డాక్టర్ విద్య సాగర్ రెడ్డి,ఆర్.బి.కె.స్టాఫ్, జడ్.బి.ఎన్. ప్ స్టాఫ్,గ్రామ నాయకులు విష్ణు,విజ్ఞేష్ రెడ్డి రామసుబ్బయ్య,గ్రామ రైతులు ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల



సిఎం రిలీఫ్ చెక్కును అందజేస్తున్న ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి

అనారోగ్యం ఎదుర్కొంటున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ అని బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. బేతంచెర్ల మండల పరిధిలోని శంకరాపురం గ్రామ నివాసి అయిన పందిరి జనార్దన్ రెడ్డి కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు వైద్య ఖర్చులకు తమ వద్ద ఉన్న మొత్తాన్ని ఖర్చు పెట్టడం జరిగింది. మెరుగైన వైద్యం కోసం తమ దగ్గర తగినంత స్తోమత లేనందున సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్నాడు. ఫలితంగా బేతంచెర్ల మండలం ఎంపీపీ నాగభూషణం రెడ్డి 18 వేల రూపాయల చెక్కును శుక్రవారం నాడు శ్రీ మద్దిలేటివి లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ బిఎస్ రామచంద్రుడు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి, రామచంద్రుడు మాట్లాడుతూ పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందించడమే కాకుండా పేద ప్రజలకు అన్ని విధాల జగనన్న ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగాపురం సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు, బలపాలపల్లి ఎద్దులన్న, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేపై రైతులకు తెలియజేయాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - రుద్రవరం



భూ సర్వేపై సంబంధిత రైతులకు సమాచారం ఇవ్వాలని తహశీల్దార్ వెంకట శివ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి శ్రీరంగాపురం టి లింగం దిన్నె గ్రామాల్లో సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామ న్నారు. ఇందులో భాగంగా ముందస్తుగా రైతులకు నోటీసులు ఎలా ఇవ్వాలి, దండోరా ద్వారా రైతులకు తెలియజేయడము, సర్వే నెంబర్ల వివరాలు, భూమిహద్దులు తెలుసుకోవడం, తదితర అంశాలపై సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం : సర్పంచి

ప్రజాశక్తి - బేతంచెర్ల

గ్రామంలోని వీధులు, ఇళ్లలో పరిశుభ్రతను పాటించి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని గోరుమాను కొండ గ్రామం సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి మహేష్ అన్నారు. బేతంచర్ల మండల పరిధిలోని గోరుమాలకొండ గ్రామంలో గ్రామ ప్రజల ఆరోగ్యం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు గ్రామ కార్యదర్శి మహేష్ సర్పంచి వెంకటేశ్వర్లు గ్రామంలోని వీధులలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లల్లోని నీటి నిలువలు మూడు రోజుల కంటే ఎక్కువగా ఉండకుండా శుభ్రం చేసుకుని వీధిలో ఇంటి పరిసర ప్రాంతాల్లో కూడా మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం గా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఫలితంగా అంటువ్యాధులు, అనారోగ్య పరిస్థితులను అరికట్టవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.